నీలగిరి నిత్యపద్యం
అంతర్జాతీయ నవ్వుల దినోత్సవం
ఆ.వె!!
నవ్వుచుండుమెపుడు, నవ్వించుచుండుము
నవ్వుతోనె బ్రతుకు నాకమౌను!
నవ్వరాదునెపుడు నలుగురినేడ్పిస్తు
నవ్వులాటగాకు నువ్వునెపుడు!!
మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.

సంచిక : 367 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | 03-05-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

# నైరుతి వచ్చేస్తోంది!

## ఈ నెలలోనే రుతుపవనాల పలకరింత

- 14 నుంచి 16 తేదీల మధ్యలోనే అండమాన్ నికోబార్‌కు రాక
- నెలాఖరులో ఇబ్బడిముబ్బడిగా వానలు
- ఇక మేలో పగటి పూటే కాదు, రాత్రిపూట ఉష్ణోగ్రతలు ఎక్కువే
- రాజస్థాన్, గుజరాత్ వంటి ప్రాంతాల్లో తీవ్ర వడగాల్పులు

న్యూఢిల్లీ,
వేసవి భానుడి భగభగలతో అల్లాడుతున్న ప్రజలకు భారత వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సాధారణం కంటే ముందే పలకరించే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. సాధారణంగా మే నెల చివరి

-మిగతా 2 లో





# బంగాల్‌లో కౌంటింగ్ కు రెడీ

- ఓట్ల లెక్కింపు కోసం సర్వం సిద్ధం
- అడిషనల్ కౌంటింగ్, పోలీస్ అబ్జర్వర్ల నియామకం
- బంగాల్ లో 77 మంది పోలీసు అబ్జర్వర్లు
- పారదర్శకంగా బంగాల్ ఓట్ల లెక్కింపు జరపడం కోసమేనన్న ఈసీ

కోల్‌కతా :
బంగాల్ లో మే 4న ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ కీలక చర్యలు చేపట్టింది. బంగాల్ లో ఉన్న కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతను మరింత బలోపేతం చేసేందుకు, శాంతి భద్రతల ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు 165 మంది అదనపు కౌంటింగ్ అబ్జర్వర్లను, 77 మంది పోలీసు అబ్జర్వర్లను నియమించినట్లు ఈసీ శనివారం తెలిపింది. ఓట్ల లెక్కింపు పారదర్శకంగా జరిగేలా చూడడమే లక్ష్యంగా ఈ అదనపు అబ్జర్వర్లను నియమించినట్లు ఈసీ స్పష్టం చేసింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 324, ప్రజాస్వామ్య ప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 20బీ కింద తమకు సంక్రమించిన అధికారాలను

-మిగతా 2 లో



# మేమున్నాం.. ఆదుకుంటాం

## ఓఆర్ఆర్ ప్రమాద కుటుంబాలకు కేటీఆర్ భరోసా

- రోడ్డు ప్రమాదంలో ఆరుగురు సిరిసిల్ల వాసులు మృతి
- ఉస్మానియా హాస్పిటల్ కు వెళ్లిన కేటీఆర్
- మృతదేహాలకు నివాళి.. బాధిత కుటుంబానికి పరామర్శ

హైదరాబాద్,
హైదరాబాద్ లోని శంషాబాద్ వద్ద ఓఆర్ఆర్ పై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆరుగురు సిరిసిల్ల వాసుల పార్థివ దేహాలకు శనివారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళు లర్పించారు. ఉస్మానియా జనరల్ హాస్పిటల్ మార్చురీ వద్ద బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పి అన్ని విధాలుగా అండగా

-మిగతా 2 లో

# ఉద్యోగుల డిమాండ్లకు సీఎం ఓకే

## నాలుగు అంశాలపై ఉద్యోగ సంఘాలకు స్పష్టతనిచ్చిన రేవంత్ రెడ్డి

- పీఆర్సీపై తక్షణమే రిపోర్టు అందించాలని అధికారుల కమిటీకి ఆదేశం
- రిపోర్టు ఆధారంగా పీఆర్సీపై నిర్ణయం తీసుకుంటామని భరోసా
- జూన్ 1 లోగా ఆరోగ్య భద్రత కార్డులను ఉద్యోగులకు అందిస్తామని హామీ
- గుర్తింపు సంఘాలు తరుచూ భేటీ అయి సమస్యలపై సర్కారుకు తెలపాలి
- ఇది ఫ్రెండ్లీ ప్రభుత్వం... మీ సమస్యలను పరిష్కరించే బాధ్యత మాదని భరోసా
- సీఎం ఇచ్చిన హామీతో హర్షం వ్యక్తం చేసిన ఉద్యోగులు

**వంద రోజుల్లో ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం రూ. 6 వేల కోట్లు చెల్లిస్తాం**


హైదరాబాద్,
తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై కీలక ముందడుగు పడింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమావేశమై వారి సమస్యలు, డిమాండ్లపై సుదీర్ఘంగా చర్చించారు. ఉద్యోగ సంఘాల జేఏసీ, ఎంప్లాయీస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ నేతలతో జరిగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నేతలు తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా శాసన మండలిలో పనిచేస్తున్న 13,100 మంది సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం చారిత్రాత్మక నిర్ణయమని కొనియాడారు. అలాగే చాలా కాలంగా పెండింగ్‌లో

-మిగతా 2 లో






## పశ్చిమాసియా, ఐరోపాలు ముక్కలయ్యేవి.. బీ2 బాంబర్లతో అడ్డుకున్నా



2 లో




# నెట్‌వర్క్ లేకపోయినా ఎమర్జెన్సీ అలర్ట్

- స్మార్ట్ ఫోన్లకు వచ్చిన మెసేజ్ లక్ష్యం ఇదే
- కమ్యూనికేషన్ కోసం భారత్ సొంత టెక్నాలజీ
- భారీ విపత్తుల సమయంలో అలర్ట్ చేయడమే లక్ష్యం

న్యూఢిల్లీ
భారత్ సొంత టెక్నాలజీతో విపత్తు హెచ్చరికల వ్యవస్థలను సిద్ధం చేస్తోంది. శనివారం జరిగిన ఈ పరీక్షల్లో భాగంగా దేశవ్యాప్తంగా లక్షలాది మంది మొబైల్ ఫోన్లు ఒక్కసారిగా పెద్ద శబ్దంతో మారుమోగాయి. అసలు ఈ వ్యవస్థ ఎందుకు అవసరం? ఎలా పని చేస్తుంది? అనే వివరాలు తెలుసుకుందాం. శనివారం 11 గంటలకు చాలా మంది మొబైల్ వినియోగదారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వారి ఫోన్లకు ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా పెద్ద శబ్దంతో కూడిన బీప్ లు, వైబ్రేషన్లతో కూడిన సందేశం వచ్చింది. ఫోన్ స్క్రీన్‌పై అత్యవసర సేవల అలర్ట్ అని ఇంగ్లీష్, తెలుగులో హెచ్చరికలు కనిపించాయి. అయితే ఇది చూసి భయపడాల్సిన పని లేదు. భారత్ ప్రభుత్వం తన కొత్త ఎమర్జెన్సీ అలర్ట్ సిస్టమ్‌ను ప్రయోగాత్మకంగా

-మిగతా 2 లో

# వచ్చే 4 రోజులు వానలు

- మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం
- పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ
- రాష్ట్రంలో తగ్గుముఖం పట్టిన పగటి ఉష్ణోగ్రతలు

హైదరాబాద్
రాష్ట్రంలో ఆదివారం నుంచి బుధవారం వరకు చాలా జిల్లాల్లో మోస్తరు వర్షం, కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న వెదర్ రిపోర్టులో వెల్లడించారు.

-మిగతా 2 లో




# హర్మ్యూజ్‌కు కొత్త నియమాలు

- ప్రకటించిన ఇరాన్
- అమెరికా దిగ్బంధనం కొనసాగించడంపై కఠిన నిర్ణయం

టెహ్రాన్
హర్మూజ్ జలసంధిపై ఇరాన్ ఎన్ని విజ్ఞప్తులు చేసినా అమెరికా తన నౌకాదళ దిగ్బంధనాన్ని కొనసాగిస్తుంది. దీంతో ఇరాన్ కఠిన నిర్ణయం తీసుకుంది. కీలక సముద్ర మార్గమైన హర్మూజ్‌పై కొత్త నియమాలు అమలు చేస్తామని శనివారం ప్రకటించింది. దీంతో హర్మూజ్ విషయంలో

-మిగతా 2 లో



# పాంచజన్యంతో.. వస్తున్నాం

## ఉచిత విద్య, వైద్యం, ఉద్యోగాలు మా టార్గెట్

- అన్ని వర్గాల ప్రజల సంక్షేమం లక్ష్యంగా పోరాటం
- ప్రతి అంశంపైనా స్పష్టమైన విధానంతో సాగుతాం
- రేవంత్‌ను ఇంటికి సాగనంపడమే ప్రథమ లక్ష్యం
- టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత

**ఉద్యమకారులకు లక్ష ఉద్యోగాలు ఇస్తాం**

హైదరాబాద్,
తెలంగాణ రక్షణసేన ఐదు అంశాలను ప్రధాన అజెండాగా తీసుకుందని కల్వకుంట్ల కవిత అన్నారు. పాంచజన్యం పూరించామని, ఇక విజయపథంలోకి దూసుకు పోతామని అన్నారు. సర్వోదయ తెలంగాణ లక్ష్యంగా పోరాటం చేస్తామని అన్నారు. ఎంత పెద్ద ఆరోగ్య సమస్య వచ్చినా.. పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో కవిత మాట్లాడారు. పేదలకు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందాలన్నదే తమ లక్ష్యం అన్నారు.

-మిగతా 2 లో





# రీపోలింగ్ లోనూ భారీగా ఓటింగ్

- బారులు తీరి ఓటేసిన జనం
- 90శాతం పోలింగ్ నమోదు

కోల్‌కతా,
పశ్చిమబెంగాల్ సౌత్ 24 పరగణాల జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన 15 బూత్‌లలో శనివారంనాడు రీపోలింగ్ ముగిసింది. మగ్రహాట్ పశ్చిమ్ అసెంబ్లీ నియోజకవర్గం లోని 11 పోలింగ్ స్టేషన్లు, డైమండ్ హార్బర్‌లోని 4 పోలింగ్ స్టేషన్లలో ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్ సాయంత్రం 6 గంటలతో ముగిసింది. 90 శాతం పోలింగ్ నమోదైనట్టు అధికార వర్గాలు తెలిపాయి. కాగా, ఉదయం 11 గంటల

-మిగతా 2 లో

# ట్రాఫిక్ ఉల్లంఘనులపై కఠిన చర్యలు

- ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్‌సేఫ్టీ బ్యూరోతో దిశానిర్దేశం
- నాలుగు కమిషనరేట్ల ట్రాఫిక్ డీసీపీలతో డీజీపీ ఆనంద్ సమావేశం



హైదరాబాద్,
రాష్ట్రంలో పెరుగుతున్న ట్రాఫిక్ ఇబ్బందులను నియంత్రించడానికి ఆ విభాగం ఉన్నతాధికారులు సమన్వయంతో పని చేయాలనీ, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నూతన డీజీపీ సి.వి ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. శనివారం హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి, ఫ్యూచర్‌సిటీలకు చెందిన ట్రాఫిక్ డీసీపీలతో డీజీపీ కీలక సమావేశం నిర్వహించారు. ఔటర్‌రింగ్‌రోడ్డుపై పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు

-మిగతా 2 లో

# బంగాల్‌లో కౌంటింగ్ కు రెడీ

మొదటి తరువాయి

ఉపయోగించి ఈ నియామకాలు చేపట్టినట్లు ఎన్నికల కమిషన్ పేర్కొంది. ఓట్ల లెక్కింపు సమయంలో అబ్జర్వర్లు డెప్యుటేషన్ పద్ధతిలో తమ నియంత్రణ, పర్యవేక్షణలో పనిచేస్తారని ఈసీ పేర్కొంది. ఒకటి కంటే ఎక్కువ కౌంటింగ్ హాళ్లు ఉన్న 165 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కౌంటింగ్ అబ్జర్వర్లకు సాయం చేసేందుకు ఈ అదనపు అధికారులను నియమించినట్లు పోల్ ప్యానల్ వివరించింది. "పోలీసు అబ్జర్వర్లు తమకు కేటాయించిన నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాల వద్ద శాంతిభద్రతల ఏర్పాట్లను పర్యవేక్షిస్తారు. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ పోలీసు అబ్జర్వర్లు ఓట్ల లెక్కింపు రోజున కౌంటింగ్ హాల్ లోకి ప్రవేశించరు. వీరు కౌంటింగ్ అబ్జర్వర్లతో, లెక్కింపు ప్రక్రియలో పాల్గొనే ఇతర ఎన్నికల యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తారు" అని ఈసీ స్పష్టం చేసింది.

గుర్తింపు కార్డులు మస్ట్

ఇక రిటర్నింగ్ అధికారులు (ఆర్ఓ), కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థులు, వారి ఏజెంట్ల కోసం గుర్తింపు కార్డులను ఐటిబిఎస్ లోని ప్రత్యేక మాడ్యూల్ ద్వారా ఆర్ఓ జారీ చేస్తారని ఎన్నికల కమిషన్ పేర్కొంది. రిటర్నింగ్ అధికారులు జారీ చేసిన క్యూఆర్ కోడ్ ఆధారిత ఫొటో ఐడీ ఉంటేనే కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతి ఇస్తారని,




లేకుండా లోపలకు వెళ్లడం కుదరదని స్పష్టం చేసింది. కౌంటింగ్ అబ్జర్వర్, రిటర్నింగ్ ఆఫీసర్ మినహా మరిలెవరూ కౌంటింగ్ హాల్ లోపలికి మొబైల్ ఫోన్ తీసుకోవడానికి అనుమతి లేదని ఈసీ తేల్చిచెప్పింది. "కంట్రోల్ యూనిట్ లో కౌంటింగ్ సూపర్ వైజర్ లు లెక్కింపు ఫలితాలు ఉండే ఫామ్ 17సీ-పార్ట్ ×× సిద్ధం చేస్తారు. కౌంటింగ్ ఏజెంట్లకు వాటిని చూపిస్తారు. కౌంటింగ్ ఏజెంట్లు కోరుకుంటే ఈ ప్రక్రియను మళ్లీ పునరావృతం చేస్తారు. ప్రతి టేబుల్ వద్ద ఉండే మైక్రో-అబ్జర్వర్లు కూడా కంట్రోల్ యూనిట్ డిస్ ప్లేలో కనిపించే ఫలితాలను వేరుగా నోట్ చేసుకుంటారు. వారు క్రాస్ వెరిఫికేషన్ కోసం ప్రతి రౌండ్ వివరాల్లో ఆ వివరాలను కౌంటింగ్ అబ్జర్వర్లకు అందజేస్తారు" అని ఈసీ పేర్కొంది.

టీఎంసీ బెదిరింపులు- ప్రజల నిరసనలు

బంగాల్ లో ఓట్ల లెక్కింపు తర్వాత తమకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ దక్షిణ 24 పరగణా జిల్లా ఫాల్టాలో శనివారం వందలాది మంది గ్రామస్థులు నిరసన చేపట్టారు. ఆ ప్రాంతంలో టీఎంసీ కార్యకర్తల నుంచి తమకు ప్రాణహాని ఉందని వారు ఆరోపించారు. నిరసనకారులలో అధిక శాతం మహిళలు పాల్గొన్నారు. వారు బీజేపీ జెండాలను పట్టుకుని హసీమ్ నగర్ గ్రామంలో రహదారిని దిగ్బంధించారు. ఎన్నికల ఫలితాలు విడుదలైన తర్వాత తమపై దాడులు చేస్తామని టీఎంసీ అభ్యర్థి జహంగీర్ ఖాన్ సన్నిహితుడు, స్థానిక పంచాయతీ ప్రధాన్ ఇసాఫిల్ బెదిరింపులకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. దీనితో సీఆర్పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్ భారీ బలగాలతో ఆ ప్రాంతాన్ని సందర్శించి, ప్రజలకు తగు భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ మహిళా మోర్చాకు చెందిన ఫాతిమా బీబీ మాట్లాడుతూ, "ఇసాఫిల్, అతని అనుచరులు ఏప్రిల్ 30 నుంచి మా ప్రాంతానికి వచ్చి, మే 5 నుంచి రక్తపాతం జరుగుతుందని మమ్మల్ని బెదిరిస్తున్నారు. అందుకే మా ప్రాంతంలో సీఆర్పీఎఫ్ బలగాలు కొనసాగాలని మేము డిమాండ్ చేస్తున్నాం" అని అన్నారు.

# ఉద్యోగుల డిమాండ్లకు సీఎం ఓకే

మొదటి తరువాయి

ఉన్న పీఆర్సీ అమలు, హెల్త్ కార్డుల జారీ వంటి ప్రధాన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సీఎంను కోరారు.

రెండేళ్లలో రాష్ట్రంలో 67,760 ఉద్యోగ నియామకాలు

ఉద్యోగుల పట్ల తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగుల కోసమే తొలి నిర్ణయం తీసుకున్నామని, ప్రతి నెలా ఒకటో తేదీకే జీతాలు అందేలా చర్యలు చేపట్టామని వెల్లడించారు. గత రెండేళ్లలో రాష్ట్రంలో 67,760 ఉద్యోగ నియామకాలు చేపట్టినట్లు సీఎం వివరించారు. అలాగే రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని సీఎం పేర్కొన్నారు. వంద రోజుల్లో ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపుల కోసం రూ. 6 వేల కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. దీనితో పదవీ విరమణ చేసిన ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనకు ఉపశమనం లభించే అవకాశం ఉంది. ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న పీఆర్సీ అంశంపై తక్షణమే నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించినట్లు సీఎం వెల్లడించారు. ఆ నివేదిక ఆధారంగా పీఆర్సీపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. దీంతో ఉద్యోగుల్లో కొత్త ఆశలు చిగురించాయి. ముఖ్యంగా పీఆర్సీ, హెల్త్ కార్డులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి అంశాలపై స్పష్టమైన హామీలు రావడంతో ఉద్యోగ సంఘాల నేతలు సంతృప్తి వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డితో కలిసిన ఉద్యోగ సంఘాల నేతల్లో మాం జగదీష్, ఏలూరి శ్రీనివాస రావు, బీ. శ్యామ్, చావ రవి, ముజీబ్ హుస్సేనీ, తదితరులు ఉన్నారు.

# పాంచజన్యంతో.. వస్తున్నాం

మొదటి తరువాయి

ధాన్యం కొనుగోళ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు రోజులతరబడి పడిగాపులు కాస్తున్నారు. ధాన్యం కుప్పల పైనే ప్రాణాలు విడుస్తున్నారు.

ప్రభుత్వాలు ఇస్తున్న హామీల వల్ల ఉపాధి అంటే హాస్యాస్పదమైంది. మేం చెప్పే ఉపాధి కల్పన అంటే.. ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే కాదు. యువత, మహిళలు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి. యువత, మహిళలను వ్యాపారులుగా తీర్చిదిద్దే ప్రణాళికలు రూపొందిస్తున్నాం. రూ. 2 లక్షల నుంచి రూ. 20 కోట్ల వరకు రుణాలు ఇచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ప్రభుత్వాలు భర్తీ చేయని బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేస్తాం అని కవిత పేర్కొన్నారు. తెలంగాణలో కొత్త రాజకీయ శక్తిగా వస్తామని చెప్పాం.. వచ్చామని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. . అన్ని అడ్డంకులను అధిగమించి తెలంగాణ రక్షణ సేన పేరుతో రాజకీయ వేదికను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 20 ఏళ్లుగా కొనసాగుతున్న తెలంగాణ జాగృతి స్వచ్ఛంద సంస్థ అలాగే కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల సమస్యలపై తెలంగాణ రక్షణ సేన పోరాటం చేస్తుందని, సర్వోదయ తెలంగాణ లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. పాంచజన్యం పేరుతో ఐదు ప్రాధాన్య అంశాలను తీసుకున్నట్లు కవిత తెలిపారు. ఇప్పుడు ప్రతిపక్షంగా ఉన్నా, భవిష్యత్తులో అధికారంలోకి వచ్చినా ప్రధాన ఫోకస్‌గా ఉంటాయని చెప్పారు. ప్రజల ఆదాయంలో 60 శాతం విద్య, వైద్యం కోసమే ఖర్చవుతోందని.. దీని వల్ల సేవింగ్స్ సాధ్యం కావడం లేదని తెలిపారు. ప్రభుత్వం ఉచిత విద్య ఇస్తున్నా 75 శాతం మంది ప్రైవేటు సంస్థల్లో చదువుతున్నారని, వారందరికీ కూడా ఉచిత విద్య అందించేందుకు అన్ని లెక్కలు వేసినట్లు తెలిపారు. వైద్యం విషయంలో క్యాన్సర్ వంటి వ్యాధులతో చికిత్సకు డబ్బుల్లేక చనిపోతున్న పరిస్థితి ఉందని కవిత అన్నారు. తెలంగాణ రక్షణ సేన ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎన్ని లక్షలు ఖర్చైనా ప్రజల వైద్యం కోసం తెలంగాణ రక్షణ సేన ప్రభుత్వం వెనుకడుగు వేయదని హామీ ఇచ్చారు. రైతన్నలకు ఆత్మగౌరవం కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని కవిత అన్నారు. ప్రస్తుతం కల్లాల దగ్గరే వడ్లు పడి ఉండటం, కొనుగోలు కేంద్రాలు తెరవాలని ధర్నాలు చేయాల్సిన పరిస్థితి ఉందని విమర్శించారు. రైస్ ఎగుమతి చేసే అవకాశాలున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఓ రైతు మక్కల కొనుగోలు కేంద్రంలోనే మరణించిన సంఘటనను ప్రస్తావించిన కవిత.. రైతు ప్రాణానికి విలువ లేకపోవడం బాధాకరమన్నారు. రైతన్నలకు మేలు చేసే విషయంలో తాము చాలా సీరియస్‌గా పనిచేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉపాధి అంటే ఒక జోక్‌గా మారిందని.. యువత అవసరాలను ప్రభుత్వం అర్థం చేసుకోవడం లేదని కవిత విమర్శించారు. 18-25 ఏళ్ల జెన్ జీ యువతను నమ్ముతున్నట్లు చెప్పారు. మంచి ఆలోచనలతో వచ్చే 25-45 ఏళ్ల వారికి రూ. 2 లక్షల నుంచి రూ. 20 కోట్ల వరకు రుణాలు ఇచ్చి ఉపాధి కల్పిస్తామని ప్రకటించారు. యువత ఉద్యోగాలు వెతకకుండా ఉద్యోగాలు ఇచ్చేలా తయారవ్వాలని.. గూగుల్, వాట్సాప్ లాంటి సంస్థలు తెలంగాణ నుంచి రావాలని ఆకాంక్షించారు. సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక శాఖ ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. 65 ఏళ్లు దాటి రిటైర్డ్ అయిన ఐఏఎస్, ఐపీఎస్‌లకు కూడా బ్యాంకులు రుణాలు ఇవ్వటం లేదన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. అగ్రవర్ణాల్లోని పేదలు, దివ్యాంగులు, మాజీ మావోయిస్టులు, మాజీ సైనికులు, అందరికీ ఇళ్లు కట్టించడం సామాజిక న్యాయమేనని కవిత వివరించారు. అమ్మలా పాలన చేస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, తమ పాలన అలాంటిదే అని కవిత పేర్కొన్నారు. ఇకపోతే తండ్రిగా కెసిఆర్‌ను విమర్శించలేదని, బిఆర్ఎస్ అధ్యక్షుడిపైనే విమర్శలు చేశామన్నారు. తాతు తలపెట్టిన ఐదు అంశాలపై పెద్ద కసరత్తు చేశామని, తమవద్ద ప్రణాళిక ఉందని అన్నారు.

# రీపోలింగ్ లోనూ భారీగా ఓటింగ్

మొదటి తరువాయి

వరకూ ఎలాంటి ఘటనలు జరగనప్పటికీ ఆ తర్వాత సౌత్ 24 పరగణాల జిల్లాలోని ఫాల్టాలో టీఎంసీ, బీజేపీ మద్దతుదారుల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. పోలింగ్ బూత్‌లకు వెళ్లకుండా టీఎంసీ కార్యకర్తలు ఓటర్లను అడ్డుకున్నట్టు బీజేపీ కార్యకర్తలు ఆరోపించగా, ఓటింగ్ పక్రియకు బీజేపీ కార్యకర్తలు అడ్డుపడుతున్నట్టు టీఎంసీ కార్యకర్తలు ఆరోపించారు. దీనికితోడు, ఫాల్టాలో స్థానికులు ఆందోళన బాటపట్టడం ఉద్రిక్తతలకు దారితీసింది. టీఎంసీ గూండాలు తమను బెదిరిస్తున్నారని, కేంద్ర బలగాలైన సీఏపీఎఫ్‌ను మోహరించి తమకు రక్షణ కల్పించాలని స్థానికులు రోడ్లపైకి వద్ద ఆందోళనలకు దిగారు. అధికారులు వెంటనే స్పందించడంలో సీఆర్పీఎఫ్, ఆర్పీఎఫ్ దళాలను మోహరించారు. టీఎంసీ గూండాలు బెదిరిస్తున్నారని, వారు గెలిస్తే తమ ఇళ్లు తగులబెడతారని, రక్తపాతం తప్పదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు భారీగా బలగాలను మోహరించినా టీఎంసీ గూండాల హింస, ఆందోళనకు ఆగడం లేదని బీజేపీ ఆరోపించింది. పశ్చిమబెంగాల్‌లోని ఒక స్టాం÷-రగ్‌రూమ్‌ను అనుమతి లేకుండా కొందరు తెరిచారని, దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. ఈ ఘటనలను ఈసీ సీరియస్‌గా తీసుకుందని, స్థానికులను బెదిరించిన టీఎంసీ గూండాలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించిందని అధికారులు చెప్పారు.

# హర్మ్యూజ్‌కు కొత్త నియమాలు

మొదటి తరువాయి

ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. తాజా పరిణామం ప్రపంచ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపనుందని అంతర్జాతీయ మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) నౌకాదళం.. తమ తీర ప్రాంతం సుమారు రెండు వేల కిలోమీటర్ల వరకు నియంత్రణను కట్టుదిట్టం చేస్తామని తెలిపింది. ఈ ప్రాంతాన్ని 'ప్రాంతీయ భద్రత, అభివృద్ధికి కేంద్రం'గా మార్చుతామని ప్రకటించింది. ఈ పరిణామాల నేపథ్యంలోనే ఇటు అమెరికా ట్రెజరీ సెక్రెటరీ స్కాట్ బెస్సెంట్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై అమలు చేస్తున్న నౌకాదళ దిగ్బంధనం కొనసాగుతుందని స్పష్టం చేశారు. "ఫిబ్రవరి 27కు ముందు ఉన్నట్టుగా స్వేచ్ఛాయుత నావిగేషన్‌ను పునరుద్ధరించేంతవరకు ఈ చర్యలు ఆగవు" అని ఆయన స్పష్టం చేశారు.

# ట్రాఫిక్ ఉల్లంఘనులపై కఠిన చర్యలు

మొదటి తరువాయి

మరణాల సంఖ్య కూడా పెరుగుతున్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం సీరియస్‌గా ఉన్నారనీ, ఈ ప్రమాదాలను నివారించడానికి పోలీసులు అవసరమైన చర్యలను తక్షణమే చేపట్టాలని సీఎం ఆదేశించినట్టు ఆనంద్ తెలిపారు. ఓఆర్‌ఆర్‌లపై వాహనాలు నిలిపి ఉంచడాన్ని వెంటనే గమనించి వాటిని అక్కడి నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. నగరంలో ఏదేనీ చిన్న రోడ్డు ప్రమాదం జరిగినా.. విపరీతంగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతున్నదనీ, ఆ విషయమై తక్షణమే ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని వెంటనే ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి వాహనదారులకు అసౌకర్యం కలగకుండా చూడాలని డీజీపీ సూచించారు. ముఖ్యంగా డ్రంకెన్ డ్రైవర్స్‌పై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలనీ, రోడ్డుపై తాగి డ్రైవింగ్ చేస్తే తమకు ఇబ్బందులు ఎదురవుతాయనే భావనను వారిలో కలిగించాలని ఆయన కోరారు. ట్రాఫిక్ రూల్స్ నిబంధనలను ఉల్లంఘించేవారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలనీ, ముఖ్యంగా హెల్మెట్ ధరించడం, సీటు బెల్టులను పెట్టుకోవడంపై నిశితంగా దృష్టిని సారించి అమలు చేయాలని ఆయన కోరారు. హైదరాబాద్‌తో సహా నాలుగు కమిషనరేట్ల ట్రాఫిక్ డీసీపీలు రెండు నెలలకోసారి సమావేశమవుతూ ట్రాఫిక్ సమస్యపై ఎదురవుతున్న సవాళ్లను అధిగమించడానికి ఎప్పటికప్పుడు కార్యాచరణను రూపొందించుకొని అమలు చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో నాలుగు కమిషనరేట్ల ట్రాఫిక్ డీసీపీలు చందనాదీప్తి, రాహుల్ హెగ్డే, కాజోల్, రాహుల్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# వచ్చే 4 రోజులు వానలు

మొదటి తరువాయి

ఆదివారం, సోమ వారాల్లో కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే సూచనలున్నాయి. ఈ మేరకు ఆ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరిక జారీ చేసింది. ఐదో తేదీన మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, ఆరో తేదీన నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ జిల్లాల్లో పలు చోట్ల భారీ వర్షాలు పడే సూచనలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆ రెండు రోజుల పాటు మిగతా అన్ని జిల్లాల్లోనూ పలు ప్రాంతాల్లో వర్షం పడొచ్చు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వచ్చే 48 గంటల పాటు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 28 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశాలున్నాయి. శనివారం రాష్ట్రంలో ఎండలు కాస్త తగ్గుముఖం పట్టాయి. అయినప్పటికీ చాలా జిల్లాల్లో 40 డిగ్రీలకుపైనే పగటి ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా 44 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.

# నైరుతి వచ్చేస్తోంది!

మొదటి తరువాయి



వారంలో వచ్చే రుతుపవనాలు, ఈసారి మే 14 నుంచి 16 తేదీల మధ్యలోనే అండమాన్ నికోబార్ దీవులను తాకనున్నాయని వెల్లడించింది. మే నెలలో దేశవ్యాప్తంగా సగటు వర్షపాతం సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. దక్షిణాది, పశ్చిమ భారతంలో కుండపోత వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని, ఈశాన్య, తూర్పు మధ్య భారతంలో మాత్రం సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావొచ్చని చెప్పింది.

రాత్రిపూట కూడా తప్పని సెగలు

వర్షాల సూచన ఉన్నప్పటికీ, ఎండల తీవ్రత విషయంలో ఐఎండీ హెచ్చరికలు జారీ చేసింది. మే నెలలో పగటి ఉష్ణోగ్రతలే కాకుండా, రాత్రిపూట ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే ఎక్కువగా ఉండనున్నాయని పేర్కొంది. దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం రాత్రిపూట ఉష్ణోగ్రతలు సాధారణంగా లేదా అంతకంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని చెప్పింది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, పశ్చిమ బెంగాల్ వంటి తీరప్రాంత రాష్ట్రాల్లో వాతావరణం భిన్నంగా ఉండనుంది. సముద్రం నుంచి వచ్చే తేమతో కూడిన గాలుల వల్ల ఉష్ణోగ్రతలు తక్కువగా అనిపించినా, ఉక్కపోత విపరీతంగా ఉంటుందని తెలిపింది. రాజస్థాన్, గుజరాత్ వంటి ప్రాంతాల్లో వడగాల్పుల ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది.

# నెట్‌వర్క్ లేకపోయినా ఎమర్జెన్సీ అలర్ట్

మొదటి తరువాయి

పరీక్షించడంలో భాగంగానే ఈ సందేశాలను పంపింది.

కమ్యూనికేషన్ కోసం..

మొబైల్ ఫోన్లకు వచ్చిన ఆ సందేశం ఇలా ఉంది. "భారత్ తన పౌరుల కోసం తక్షణ విపత్తు హెచ్చరిక సేవలను అందించేందుకు స్వదేశీ సాంకేతికతను ఉపయోగించి సెల్ బ్రాడ్ కాస్ట్‌ను ప్రారంభించింది. అప్రమత్తమైన పౌరులే సురక్షితమైన దేశానికి ఆధారం. ఈ సందేశం అందిన తర్వాత ప్రజలు ఎటువంటి చర్య తీసుకోవాల్సిన పని లేదు. ఇది కేవలం భారత్ ప్రభుత్వం పంపిన పరీక్ష సందేశం మాత్రమే". ఈ పని భారత్ ప్రభుత్వంలోని రెండు కీలక విభాగాలు సమన్వయం చేసుకుంటున్నాయి. టెలికమ్యూనికేషన్ల శాఖ టెక్నాలజీ సహకారం, మొబైల్ నెట్‌వర్క్‌ల ద్వారా సందేశాల పంపిణీ బాధ్యతను చూస్తుంది. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ విపత్తు నిర్వహణలో భాగంగా పౌరుల ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించడం దీని ప్రధాన లక్ష్యం. ఈ రెండు విభాగాలు కలిపి దేశవ్యాప్తంగా మొబైల్ ఆధారిత విపత్తు కమ్యూనికేషన్ వ్యవస్థలను బలోపేతం చేస్తున్నాయి.

విపత్తుల సమయంలో అలర్ట్..

గతంలో సునామీలు, తుపాన్లు, భూకంపాలు వచ్చినప్పుడు సమాచారాన్ని ప్రజలకు చేరవేయడానికి రేడియోలు, టీవీ లేదా సాధారణ ఎస్ఎంఎస్‌పై ఆధారపడాల్సి వచ్చేది. అయితే, విపత్తు సమయంలో నెట్‌వర్క్ జామ్ కావడం లేదా సమాచారం అందడంలో జాప్యం వల్ల ప్రాణ నష్టం ఎక్కువగా ఉండేది. ఈ వ్యవస్థతో సెకనుల వ్యవధిలోనే కోట్ల మందికి ఏక కాలంలో సమాచారాన్ని చేరవేయవచ్చు. సాధారణ ఎస్ఎంఎస్‌ల వలె కాకుండా, ఇది సెల్ బ్రాడ్ కాస్ట్ టెక్నాలజీపై పని చేస్తుంది. దీని వల్ల నెట్‌వర్క్ రద్దీగా ఉన్నా సందేశం నేరుగా ఫోన్ స్క్రీన్‌పై కనిపిస్తుంది. తుపాన్లు, వరదలు, సునామీ వంటి విపత్తులు వచ్చేటప్పుడు ప్రజలను ముందుగా సురక్షిత ప్రాంతాలకు వెళ్లమని హెచ్చరించడానికి ఇది అద్భుతంగా పని చేస్తుంది. ఇది పూర్తిగా భారతీయ టెక్నాలజీతో తయారు చేశారు. దీని వల్ల భద్రత, నియంత్రణ మన చేతుల్లోనే ఉంటుంది. ఈ వ్యవస్థ సెల్ బ్రాడ్ కాస్ట్ అనే టెక్నాలజీ ఉపయోగిస్తారు. మీరు ఇంటర్నెట్ ఆన్‌లో ఉంచకపోయినా మెసేజ్ వస్తుంది. ఫోన్ సైలెంట్ మోడ్‌లో ఉన్నా కూడా ఎమర్జెన్సీ అలర్ట్ వస్తుంది. ఇది టెలికాం టవర్ల ద్వారా నిర్ణీత ప్రాంతాల్లోని మొబైల్ ఫోన్లన్నింటికీ ఏక కాలంలో సిగ్నల్ పంపుతుంది.

# మేమున్నాం.. ఆదుకుంటాం

మొదటి తరువాయి

ఉంటామని భరోసా ఇచ్చారు.

వేసవి సెలవులని..

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సర్దార్ నగర్ కు చెందిన బొల్లి శివకుమార్ (40), బొల్లి లాస్య (35) దంపతులకు కూతురు రిషిక (8) ఉన్నారు. వీరు హైదరాబాద్ సనత్ నగర్ లో నివాసం ఉంటున్నారు. శివకుమార్ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, లాస్య సివిల్ సప్లై శాఖలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. వేసవి సెలవులు కావడంతో సిరిసిల్లలో ఉంటున్న శివకుమార్ సోదరి కోడం తేజశ్రీ (శ్వేత) (36), భర్త శ్రీనివాస్ (41), పిల్లలు కృష్ణచంద్ర (14), మాధవ్ (11)తో కలిసి గురువారం హైదరాబాద్ కు వెళ్లారు.

దైవదర్శనం చేసుకుని వస్తూ..

శుక్రవారం రెండు కుటుంబాలు యాదగిరిగుట్ట, స్వర్ణగిరిలో దైవదర్శనానికి వెళ్లాయి. తిరుగు ప్రయాణంలో సాయంత్రం 4 గంటల ప్రాంతంలో శంషాబాద్ ఓఆర్ఆర్ పై 16వ ఎగ్జిట్ వద్ద ఆగి ఉన్న లారీని వీరు ప్రయాణిస్తున్న కారు అతివేగంగా ఢీకొన్నది. దీంతో కారు లారీలో ఇరుక్కుని నుజ్జునుజ్జయింది. అక్కడికక్కడే ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. కారులో నుజ్జయిన మృతదేహాలను అతికష్టం మీద వెలికితీశారు. ఈ ప్రమాదంలో శివకుమార్, లాస్య, శ్రీనివాస్, చిన్నారులు రిషిక, కృష్ణచంద్ర, మాధవ్ మృత్యువాత పడ్డారు. కోడం తేజశ్రీ (శ్వేత) చావు బతుకుల్లో ఉండగా హైదరాబాద్ ఉస్మానియా దవాఖానకు తరలించారు.

# పశ్చిమాసియా, ఐరోపాలు ముక్కలయ్యేవి.. బీ2 బాంబర్లతో అడ్డుకున్నా : ట్రంప్

**న్యూఢిల్లీ,**

ఇరాన్‌పై యుద్ధాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సమర్థించుకున్నారు. బీ2 బాంబర్లతో ఆ దేశంపై దాడి చేసి..అది అణ్వాయుధాన్ని తయారు చేయకుండా అడ్డుకొన్నామని అన్నారు. ఒకవేళ తాను అలా చేయకుంటే..పశ్చిమాసియా, ఐరోపా దేశాలు ముక్కలైపోయి ఉండేవని వ్యాఖ్యానించారు.ఫ్లోరిడాలో మాట్లాడుతూ ఇరాన్ నాయకత్వం కూడా బలహీనపడిందని పేర్కొన్నారు. దీంతో ఆ దేశ సైనిక సామర్థ్యం గణనీయంగా క్షీణించిందని తమ సైనిక చర్యతో నాశనమైందని తెలిపారు.

# మట్టి రవాణాపై కట్టుదిట్టమైన నియంత్రణలు అమలు చేయాలి

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



**పెద్దపల్లి, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలో ఇటుక బట్టీలకు చెరువుల నుండి మట్టి రవాణాపై కట్టుదిట్టమైన నియంత్రణలు అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పష్టం చేశారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీరు లేని చెరువుల నుండి మాత్రమే మట్టి తవ్వకాలకు అనుమతులు ఇవ్వాలని, ప్రస్తుతం కొదురుపాక, రాయకుంట, ముత్తారం చెరువులకు మాత్రమే అనుమతులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ప్రతి వాహన రవాణాను ఫోటోగ్రఫీ చేయడం, రసీదు జారీ చేయడం తప్పనిసరి అని, అధిక లోడుతో రవాణా నిషేధమని హెచ్చరించారు. అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, మానేరువాగు పరిధిలో ఇసుక తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో పెద్దపల్లి జిల్లా ముందంజలో ఉందని కలెక్టర్ తెలిపారు. బందంపల్లి స్వరూప గార్డెన్స్‌లో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు, డిసిపి రామ్ రెడ్డి మరియు అధికారులు పాల్గొన్నారు. పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచి నాలుగు అవార్డులు సాధించిందని, ఓపీ సంఖ్య 280 నుండి 900కు, ప్రసవాలు నెలకు 40 నుండి 250కు పెరిగాయని కలెక్టర్ వివరించారు. కొత్త ఆసుపత్రి భవనం నిర్మాణం వేగంగా జరుగుతోందని, ఎంఆర్ఐ, సీటీ స్కాన్ సౌకర్యాలు త్వరలో అందుబాటులోకి వస్తాయని తెలిపారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సేవలు ఉచితంగా అందిస్తున్నామని, ప్రైవేట్ ఆసుపత్రుల్లో లక్షలు ఖర్చయ్యే చికిత్సను ఇక్కడ ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. రైతులు పంట మార్పుపై దృష్టి పెట్టాలని, వరి, మొక్కజొన్నలతో పాటు ఇతర పంటలను కూడా పండించాలని సూచించారు. మహిళల సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, వడ్డీరహిత రుణాలు, వ్యాపార అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు.పెద్దపల్లి జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తోందని అధికారులు పేర్కొన్నారు.

# రైతు వారోత్సవాలు విజయవంతం చేయాలి

**- కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్**




**అమ్రాబాద్, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** అచ్చంపేట పట్టణంలోని బీకే ప్యాలెస్ ఫంక్షన్ హాల్లో శనివారం నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సభలో నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ మాట్లాడుతూ ప్రజల వినతులను తక్షణమే పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో భాగంగా తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, విద్య, వైద్య సేవల అభివృద్ధి పనులు వేగవంతం చేస్తున్నామని ఆయన వివరించారు. సభలో ప్రజల నుంచి భూమి సమస్యలు, పెన్షన్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లపై వినతులను స్వీకరించారు.మే 4 నుంచి ప్రారంభం కానున్న రైతు వారోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పంట మార్పిడి, సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. వినతుల పరిష్కారంలో ఎలాంటి అవినీతి, జాప్యం జరగకూడదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలని ఆయన స్పష్టం చేశారు.విద్యార్థుల కోసం రాగి జావా, వేడి పాలు, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వంటి కొత్త పథకాలను త్వరలో అమలు చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. రైతు వారోత్సవాలు గ్రామీణాభివృద్ధికి, రైతుల సంక్షేమానికి కీలకమని ఆయన పేర్కొన్నారు.

# మహిళా సర్పంచ్‌పై ఆరోపణలు అవాస్తవం




**పాలకుర్తి, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పాలకుర్తి గ్రామ సర్పంచ్ పెద్దపల్లి తిరుమలపై జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ పార్శవేణి శ్రీనివాస్, మండలాధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని గ్రామ ప్రజలు పేర్కొన్నారు.ఐకేపీ కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో గ్రామ ప్రజలు మాట్లాడుతూ, ఐకేపీ నిర్వహణలో జరుగుతున్న గొడవలకు సర్పంచ్‌కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. గతంలో వడ్ల కొనుగోలు కేంద్రంలో నిర్వహణ బాధ్యతలు చేపట్టిన నగూరి జ్యోతి రైతులను ఇబ్బందులకు గురి చేయడంతో, ఈసారి రైతుల కోరిక మేరకు కొత్త వారికి బాధ్యతలు అప్పగించామని తెలిపారు.తనపై లంచం ఆరోపణలు చేయడం సరైంది కాదని, ఎలాంటి లంచం అడగలేదని, అవసరమైతే గ్రామ దేవత ఎల్లమ్మ గుడిలో ప్రమాణం చేయడానికి సిద్ధమని సర్పంచ్ తిరుమల పేర్కొన్నారు. అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ యాజమాన్యంతో పోరాడి గ్రామ యువతకు విద్యార్హత ప్రకారం ఉద్యోగాలు కల్పించాలని మాత్రమే అడిగానని, డబ్బులు వసూలు చేసి ఉపాధి అవకాశాలు కల్పించలేదని అన్నారు.తాను గెలిచిన నాటి నుండి గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నానని, మహిళా సర్పంచ్ అనే గౌరవాన్ని దెబ్బతీయడానికి చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. తాను కూడా కాంగ్రెస్ పార్టీకి చెందినవారినేనని, పార్టీకి, ప్రజలకు చిత్తశుద్ధితో సేవ చేస్తున్నానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఐద బుగ్గ రామస్వామి, వార్డు సభ్యులు, పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.సర్పంచ్ తిరుమలపై ఆరోపణలు అవాస్తవమని గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా పేర్కొన్నారు.

## అభివృద్ధి దిశగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక



**హుస్నాబాద్, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** హుస్నాబాద్ పట్టణంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ఘనంగా జరిగింది. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో రైతు భరోసా, రైతు బీమా, ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత విద్యుత్, పింఛన్లు, రేషన్ కార్డులు వంటి పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయని తెలిపారు.రోడ్ల అభివృద్ధి, గౌరవెల్లి ప్రాజెక్టు, విద్యా సంస్థలు, ఆసుపత్రి సౌకర్యాలు, పట్టణ సుందరీకరణ, పర్యాటక ప్రాజెక్టులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మహిళల సాధికారత, రైతుల పంట మార్పు, ఆర్గానిక్ వ్యవసాయం, కబడ్డీ అకాడమీ, హోల్సేల్ మార్కెట్ వంటి కార్యక్రమాలు అమలులో ఉన్నాయని వివరించారు.జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమం ద్వారా ప్రజల భాగస్వామ్యం పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు.హుస్నాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

# నా చావుకు వారే కారణం.. నోట్ రాసి సూసైడ్..!



**చిట్యాల మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** చిట్యాల మండలం నేరడలో విషాదం నెలకొంది.శనివారం తెల్లవారుజామున చేనేత కార్మికుడు సత్యనారాయణ తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పుల బాధతో పాటు, తనకు డబ్బులు ఇవ్వాల్సిన వారు ఇవ్వకపోవడంతో మనస్తాపంతో బలవన్మరణానికి పాల్పడ్డాడని గ్రామస్థులు చెబుతున్నారు. తన మరణానికి నలుగురు వ్యక్తులు కారణమని పేర్కొంటూ ఆయన సూసైడ్ నోట్ రాసినట్లు సమాచారం.

# దేవాలయానికి వాటర్ ప్యూరిఫైయర్ అందజేత




**కరీంనగర్ రూరల్, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** లయన్స్ క్లబ్ గోల్డెన్ శాతవాహన డైరెక్టర్ లయన్ అలిశెట్టి శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయానికి 30 వేల రూపాయల విలువైన వాటర్ కూలింగ్ ప్యూరిఫైయర్ మిషన్‌ను భక్తుల సౌకర్యార్థం అందజేశారు.ప్రతి సంవత్సరం తన జన్మదినం సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించే అలిశెట్టి శ్రీనివాస్ ఈసారి దేవాలయానికి ప్యూరిఫైయర్ అందజేయడం జరిగింది. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320జి థర్డ్ జోన్ చైర్‌పర్సన్ లయన్ మాను వాడ శంకర్, చార్టర్ ప్రెసిడెంట్ లయన్ అక్కెనపల్లి అజయ్ కుమార్, సెక్రటరీ పాశం నర్సింహారెడ్డి, లయన్ బండారి గంగాధర్, లయన్ ఉదారం వెంకటస్వామి, కుటుంబ సభ్యులు, దేవస్థానం పూజారి యుగంధర్ స్వామి, హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.అంతకుముందు కార్మిక దినోత్సవం సందర్భంగా పద్మనగర్ ఆదర్శ చేనేత సహకార సంఘంలో 50 మంది నేత కార్మికులకు అన్నప్రసాదం అందజేశారు.సామాజిక సేవలో భాగంగా లయన్స్ క్లబ్ కార్యక్రమాలు ప్రశంసలు పొందుతున్నాయి.

# సఫాయి కార్మికుల సేవలు వెలకట్టలేనివి



**కరీంనగర్, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ నగరపాలక సంస్థలో పనిచేస్తున్న సఫాయి కార్మికులకు వేసవికాలం దృష్ట్యా టవల్స్, వాటర్ బాటిల్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు పాల్గొని కార్మికుల సేవలను కొనియాడారు. నగర పరిశుభ్రత కోసం వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రమాదాలను గుర్తు చేస్తూ, వారి కృషి వల్లే కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందని ఆయన తెలిపారు. కార్మికుల వేతనాలను పెంచేలా చర్యలు తీసుకోవాలని, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా సౌకర్యాలు కల్పించనున్నట్లు వెల్లడించారు.సమాజానికి ఆరోగ్యకరమైన వాతావరణం అందిస్తున్న సఫాయి కార్మికుల సేవలు అమూల్యమని డిప్యూటీ మేయర్ అన్నారు.

# మద్యం సేవించి వాహనం నడిపిన నలుగురికి జైలు శిక్ష

**కరీంనగర్, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన నలుగురికి ఎక్సైజ్ కోర్టు జైలు శిక్ష విధించింది. వీరిలో ఒకరికి 14 రోజుల శిక్ష, మరో ముగ్గురికి 7 రోజుల శిక్ష విధించారు. కరీంనగర్ వల్లంపహాడ్‌కు చెందిన బొమ్మకంటి ప్రవీణ్‌కుమార్‌కు 14 రోజుల జైలు శిక్ష, పూడూరుకు చెందిన మామిడి కమల్, రామగుండం సయ్యద్ మజీద్, పెద్దపల్లి కాసులపల్లి గుంజ సాగర్‌లకు 7 రోజుల జైలు శిక్ష విధించారు.న్యాయమూర్తి ఆదేశాల మేరకు పోలీసులు నిందితులను జైలుకు తరలించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల తమతో పాటు ఇతరుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు స్పష్టం చేశారు.

# శ్రీరాజా రాజేశ్వర డిగ్రీ కళాశాల ఎదురుగా ఆర్‌బివిఆర్ వర్ధంతి వేడుకలు



**కరీంనగర్, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పోలీస్ కొత్వాల్ స్వర్గీయ రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి 73వ వర్ధంతి సందర్భంగా కరీంనగర్‌లోని శ్రీరాజా రాజేశ్వర డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న విగ్రహం వద్ద వర్ధంతి వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు నరహరి జగ్గారెడ్డి, సెక్రటరీ బండ గోపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉచ్చిడి మోహన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పూలమాలలు వేసి నివాళులర్పించారు.వారి ఆశయాలను కొనసాగిద్దాం అంటూ నినాదాలు చేశారు. నిజాం కాలంలో కొత్వాల్‌గా పనిచేసిన ఆయన పదవీ విరమణ అనంతరం విద్యార్థుల కోసం వసతి గృహం ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి కృషి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కరీంనగర్‌లో ఆర్‌బివిఆర్ బి.ఈ.డి కళాశాల స్థాపన ఆయన ఆశయాలకు అనుగుణంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం బాధ్యులు, రెడ్డి కుల బంధువులు, కళాశాల ఆచార్యులు పాల్గొన్నారు. రాజా బహదూర్ ఆశయాల సాధనకోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని వర్ధంతి సభలో పిలుపునిచ్చారు.

# నిజాయితీ చాటుకున్న యువకుడు



**కరీంనగర్ రూరల్, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బొమ్మకల్ 6వ డివిజన్‌కు చెందిన ఆసిరి సుమన్ తనకు కల్పనా హోటల్ వద్ద దొరికిన స్మార్ట్‌ఫోన్‌ను పోలీసులకు అందజేసి తన నిజాయితీని చాటుకున్నారు.సుమన్ చేసిన ఈ చర్య స్థానికుల ప్రశంసలు పొందింది. సమాజంలో యువత నిజాయితీతో ముందుకు రావడం ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతుందని పోలీసులు అభిప్రాయపడ్డారు.స్మార్ట్‌ఫోన్‌ను యజమానికి చేరవేయడంలో సుమన్ చూపిన నిజాయితీ ఆదర్శప్రాయంగా నిలిచింది.

# హనుమాన్ దేవాలయంలో బోర్ వెల్ ఏర్పాటు



**కరీంనగర్ రూరల్, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బొమ్మకల్ 6వ డివిజన్‌లో మహిళా సంఘం భవనం వద్ద నూతనంగా నిర్మించిన హనుమాన్ దేవాలయంలో భక్తుల సౌకర్యార్థం బోర్ వెల్ ఏర్పాటు చేశారు.కార్పొరేటర్ మేకల వెంకటేష్ ఆధ్వర్యంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ ఎంపీ నిధులతో ఈ పనులు చేపట్టగా, మేకల వెంకటేష్ కొబ్బరికాయ కొట్టి బోర్ వెల్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, రైల్వే బోర్డు సభ్యులు పాశం తిరుపతి, రాష్ట్ర నాయకులు చిందం అశోక్, జిల్లా నాయకులు కాల్వ రామచంద్రం, పుట్టపాక శ్రీధర్, గాలిపెల్లి నారాయణ, గాలిపెల్లి వెంకన్న, గాలిపెల్లి లక్ష్మణ్, పోగుల సాయిచంద్, కాల్వ శ్రీకాంత్, నేరెళ్ల శశి, గన్ను మణిదీప్, కామ్రెడ్డి ప్రేమ్ కుమార్, గాలిపెల్లి శంకర్, ఆలయ కమిటీ సభ్యులు, హనుమాన్ స్వాములు, భక్తులు పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఈ బోర్ వెల్ స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

# కలెక్టరేట్‌లో కుక్కల స్వైరవిహారం



**కరీంనగర్, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సముదాయం ఇప్పుడు వీధి కుక్కల ఆవాసంగా మారింది. ప్రతిరోజూ వందలాది మంది ప్రజలు, అధికారులు వచ్చే ఈ ప్రాంగణంలో కుక్కలు యథేచ్ఛగా తిరుగుతూ, నడిచే దారుల్లోనే నిద్రిస్తున్నాయి. ముఖ్యంగా సర్వే మరియు భూమి రికార్డుల సహాయ సంచాలకుల కార్యాలయ పరిసరాల్లో కుక్కలు తిష్ట వేసి ఉండటంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ప్రభుత్వ కార్యాలయానికి వచ్చే సామాన్యులు లోపలికి వెళ్లాలంటేనే జంకుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టరేట్ లాంటి అత్యున్నత కార్యాలయంలోనే ఇలాంటి పరిస్థితి నెలకొనడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తి కలిగిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, కుక్కల బెడదను నివారించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజా రాకపోకలు ఎక్కువగా ఉండే కలెక్టరేట్‌లో కుక్కల స్వైరవిహారం ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తోంది.


# మానకొండూర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శ్రీకారం



**గన్నేరువరం/ తిమ్మాపూర్, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం ఖాసీంపేట గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్మించిన కిచెన్ షెడ్, వాటర్ ప్లాంట్, సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. అదే రోజు నర్సింగపూర్ గ్రామంలో 20 లక్షల నిధులతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. పోలంపల్లిలో సీసీ రోడ్డు, భక్తాంజనేయ ఆలయం వద్ద బోరు ప్రారంభించి ప్రత్యేక పూజలు చేశారు. కొత్తపల్లి సాయిరాం గార్డెన్‌లో జరిగిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల దరికే ప్రభుత్వ పథకాలు చేరాలని, సంక్షేమ పథకాల ద్వారా నిరుపేదలకు లబ్ధి చేకూరినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. రైతు రుణమాఫీ, గృహ జ్యోతి కింద ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, విద్య, వైద్యం, గృహ నిర్మాణాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. మానకొండూర్‌లో 50 పడకల ఆసుపత్రి త్వరలో అందుబాటులోకి రానుందని, యాదవులపల్లిలో 200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం కొనసాగుతోందని, వ్యవసాయ కళాశాల కూడా మంజూరైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా 37 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే సత్యనారాయణ స్పష్టం చేశారు.

# కుక్కల దాడితో గొర్రెల పెంపకదారులకు నష్టం



**మానకొండూర్, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మానకొండూర్ మండలం రంగపేట గ్రామంలో జరిగిన కుక్కల దాడిలో 15 గొర్రెలు మృతి చెందగా, మరో ఐదు గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. ఈ ఘటనతో గొర్రెల పెంపక రైతు తీవ్ర ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొన్నారు. అఖిల భారత యాదవ మహాసభ జిల్లా నాయకులు గ్రామానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ సందబోయిన ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ గొర్రెల పెంపకమే జీవనాధారంగా పెట్టుకున్న రైతులు ఇలాంటి దాడుల వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపరిహారం అందించడంతో పాటు ఇన్సూరెన్స్ పద్ధతులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ బబ్బురి కుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఆవుల మల్లేశం యాదవ్, ఉప సర్పంచ్ కొమురయ్య యాదవ్, యాదవ నాయకులు ముక్కెర కొమురయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు. కుక్కల దాడి రైతుకు తీవ్ర ఆర్థిక నష్టాన్ని మిగిల్చింది.

# శక్తి సదన్ సందర్శించిన సెషన్స్ జడ్జి



**కరీంనగర్, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా మొదటి అదనపు సెషన్స్ జడ్జి డి. వెంకటేష్ శనివారం అశోక్‌నగర్‌లోని శక్తి సదన్‌ను సందర్శించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ శక్తి పథకం ద్వారా ప్రకృతి పర్యావరణ సంస్థ నిర్వహిస్తున్న ఈ కేంద్రంలో జరుగుతున్న సేవలు, సౌకర్యాలను ఆయన పరిశీలించారు. బాధిత మహిళలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్శనలో శక్తి సదన్ సూపరింటెండెంట్ ఎ. రమాదేవి, సిబ్బంది వసంత, రజిత, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. బాధిత మహిళలకు అందిస్తున్న సేవలను జడ్జి సమీక్షించారు.

# డంపింగ్ యార్డ్ సమస్యపై రవీందర్ సింగ్ ఆగ్రహం



**కరీంనగర్, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** డంపింగ్ యార్డ్ సమస్య, టెండర్లలో అవకతవకలు, కార్పొరేటర్లపై అన్యాయ అరెస్టులపై మాజీ మేయర్, 58వ డివిజన్ కార్పొరేటర్ సర్దార్ రవీందర్ సింగ్ తీవ్రంగా మండిపడ్డారు. నగర ప్రజలు ప్రతిరోజూ పొగ, దుర్వాసనతో నరకయాతన అనుభవిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. రూ. 2 కోట్ల నిధులు మంజూరైనప్పటికీ టెండర్లు ఓపెన్ చేయకపోవడం వెనుక అవినీతి కారణమని ఆరోపించారు. "అధికారుల చేతులకు రోగం పుట్టిందా? టెండర్లు ఎందుకు ఓపెన్ చేయడం లేదు?" అంటూ ఘాటుగా ప్రశ్నించారు. బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న కాంట్రాక్టర్లకే మళ్లీ అవకాశాలు ఇస్తున్నారని, ప్రజల ఆరోగ్యాన్ని పక్కన పెట్టి డబ్బుల లెక్కలు చూస్తున్నారని మండిపడ్డారు. ప్రజల సమస్యలపై నిలదీస్తే కార్పొరేటర్లపై కేసులు పెడతారా అని ప్రశ్నిస్తూ, అవినీతి అధికారులపై మాత్రం చర్యలు లేకపోవడం దారుణమని అన్నారు. అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేటర్లు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని, ప్రజల కోసం ఉద్యమానికి సిద్ధమని రవీందర్ సింగ్ స్పష్టం చేశారు. డంపింగ్ యార్డ్ సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ప్రజలతో కలిసి భారీ ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యం, హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని రవీందర్ సింగ్ తెలిపారు.

# పారాగ్లైడర్స్ , డ్రోన్ల వినియోగంపై నిషేధాజ్ఞలు కొనసాగింపు



**కరీంనగర్, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భద్రతా కారణాల దృష్ట్యా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పారాగ్లైడర్స్, డ్రోన్లు, మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్ వినియోగంపై నిషేధాజ్ఞలు ఈ నెల 31 వరకు అమల్లో ఉంటాయని కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. వివాహాలు, శుభకార్యాలు, ఇతర కార్యక్రమాల్లో వీటి వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఉగ్రవాదులు, అసాంఘిక శక్తులు దుర్వినియోగం చేసే అవకాశాలు ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. వినియోగించదలచిన వారు ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. అలాగే డిజె సౌండ్ వినియోగంపై ఉన్న నిషేధాన్ని కూడా ఈ నెల 31 వరకు పొడిగించారు. శబ్ద కాలుష్యం వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నందున ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అవసరమైతే సంబంధిత ఏసిపి అనుమతి తీసుకుని పరిమితులలో మైక్ సెట్లు వినియోగించుకోవాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై కూడా నిషేధాజ్ఞలు కొనసాగుతున్నాయి. మద్యం సేవించి అసభ్య పదజాలం ఉపయోగించడం, ప్రజలకు ఇబ్బందులు కలిగించడం వంటి ఘటనలు పెరుగుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు కమిషనర్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఐపిసి 188తో పాటు సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ గౌష్ ఆలం హెచ్చరించారు.

# జనగణనలో బీసీల కుల గణన డిమాండ్



**నాగర్‌కర్నూలు, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

దేశవ్యాప్తంగా జరగబోయే జనగణనలో బీసీల కుల గణన తప్పనిసరిగా చేపట్టాలని, అలాగే కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ మహిళలకు చట్టసభలలో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ప్రధాని మోదీ పాలనలో బీసీల పరిస్థితి మరింత దుర్భరంగా మారిందని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న 42% రిజర్వేషన్ల పెంపు బిల్లులపై స్పష్టత ఇవ్వాలని, హౌస్‌హోల్డ్ సర్వేలో ఓబీసీ గణనను చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ కాళ్ళ నిరంజన్ మాట్లాడుతూ డిమాండ్లు నెరవేరని పక్షంలో మే 9న ఇందిరా పార్క్ వద్ద భారీ నిరసన దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీసీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు రేణుక, వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్ గౌడ్, రైతు సంఘం అధ్యక్షులు దాసరి నిరంజన్ యాదవ్, యువసేన అధ్యక్షులు నేష లక్ష్మయ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# పొద్దు తిరుగుడు గింజలను కొనుగోలు చెయ్యాలని డిమాండ్



**హుస్నాబాద్, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో నిల్వ ఉన్న పొద్దు తిరుగుడు గింజలను ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. పార్టీ నాయకులు మార్కెట్ యార్డ్ సూపర్‌వైజర్ సూద్దాల గంగారామ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నియోజకవర్గ ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవడంలో విఫలమైందని విమర్శించారు. యార్డ్‌లో దాదాపు 70 క్వింటాళ్లకు పైగా గింజలు నెల రోజులుగా కొనుగోలు లేకుండా నిల్వ ఉన్నాయని, దీనివల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నియోజకవర్గానికి మంత్రి ఉన్నప్పటికీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గింజలను కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతులను ఇబ్బందులకు గురి చేస్తే బీఆర్ఎస్ పార్టీ తరఫున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బండి రమణ రెడ్డి, యాస శ్రీనివాస్, అయిలేని గాల్ రెడ్డి, దొంతబోయిన శ్రీనివాస్, కందుకూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# 6 ఏళ్ల కోటగిరి వర్ణిక నందన ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం




**కరీంనగర్, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లా జ్యోతినగర్‌కు చెందిన 6 ఏళ్ల కోటగిరి వర్ణిక నందన ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించి అరుదైన ప్రతిభను చాటుకుంది. హైదరాబాద్‌లో నివసిస్తున్న వర్ణిక కేవలం ఆరు నిమిషాల్లో పిరమిన్క్స్, 2ఇ2, 3ఇ3, స్క్వేబ్, బ్యారెల్ క్యూబ్‌లను సాల్వ్ చేస్తూ, అదే సమయంలో గాయత్రి మంత్రాన్ని 53 సార్లు జపించడం ద్వారా ఈ ఘనత సాధించింది. తల్లిదండ్రులు హరి కృష్ణ, సింధుజ నిరంతరం ప్రోత్సహించడంతో పాటు క్రమశిక్షణతో సాధన చేయడానికి మార్గనిర్దేశం చేశారు. కుటుంబ సభ్యుల సహకారం ఈ విజయానికి కీలకమని వారు తెలిపారు. వర్ణిక విజయంపై కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభతో వర్ణిక ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించడం గర్వకారణంగా నిలిచింది.

# ఉచిత కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**- టీఎంఎస్ ఫౌండర్ చైర్మన్ అవార్డు గ్రహీత దొనికెన పద్మ**





**హైదరాబాద్, మే 2(నీలగిరి ఎక్స్ ప్రెస్):** మహిళలు ఉచిత కుట్టు మిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలను పొందాలని టీఎంఎస్ ఫౌండర్ చైర్మన్ అవార్డు గ్రహీత దొనికెన పద్మ అన్నారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీ కేంద్రంలోని సేయింట్ మేరీస్ గ్రామర్ హై స్కూల్లో ఆమె శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దొనికెన పద్మ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ శిక్షణ ద్వారా మహిళలకు టైలరింగ్,బ్యూటీషియన్, బేసిక్ కంప్యూటర్ కోర్సులలో ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా కల్పించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఈ కింది నెంబర్ (9502038615) ను సంప్రదించగలరు.

# ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం



**గంగాధర, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చొప్పదండి నియోజకవర్గంలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు శనివారం గంగాధర మండలంలో జరిగాయి. ఉద్యానం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలల సౌకర్యాలు, బోధన విధానాలు, వాతావరణాన్ని చూపించే వీడియోను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. బడిబాట కార్యక్రమంలో నమోదు పెంచడమే దీని ఉద్దేశమని ఆయన తెలిపారు. ఇస్లాంపూర్‌లో కలెక్టర్ చిత్ర మిశ్రా వరి కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తేమ శాతం పరిశీలన, రిజిస్టర్ తనిఖీ చేసి, కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలని సూచించారు. పాపాయపల్లిలో జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, శాఖల వారీగా సమస్యలు పరిష్కరిస్తూ అర్హులకు పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళా సంక్షేమం, ఇందిరమ్మ ఇళ్లు, ప్రజావాణి సమస్యల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని వివరించారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ పథకాలు అందిస్తున్నామని, పేదలకు సన్నబియ్యం, ఉచిత ఆర్టీసీ బస్సు, గృహలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతులకు బోనస్, రుణమాఫీ వంటి పథకాలు అమలవుతున్నాయని చెప్పారు. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తయితే సాగునీటి సమస్యలు తీరుతాయని, పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పిస్తానని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని, రైతులు, పేదల సంక్షేమం కోసం కృషి చేస్తామని కలెక్టర్ చిత్ర మిశ్రా, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం స్పష్టం చేశారు.

# అన్నదాతకు ప్రజాప్రభుత్వం అండ

- మద్దతు ధరకే ధాన్యం సేకరణ
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- కడ్తాలలో రైతు వేదికలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**ఆమనగల్లు, మే 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తున్న అన్నదాతలకు సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజాప్రభుత్వం అండగా ఉంటుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం కడ్తాల్ మండల కేంద్రంలో జిల్లా పౌరసరఫరాల శాఖ సహకారంతో ఐకెపి వారు ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల పార్టీ అధ్యక్షులు బిచ్య నాయక్ ఆధ్వర్యంలో ఆమనగల్లు మార్కెట్ చైర్ పర్సన్ యాట గీతా నర్సింహా, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, పొల్యూషన్ బోర్డ్ మెంబర్ ఠాకూర్ బాలాజీ సింగ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి ఎమ్మెల్యే నారాయణరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు కొనుగోలు కేంద్రాలలోనే ధాన్య విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని కోరారు. సన్న వడ్లకు క్వింటాల్ కు రూ. 500 ప్రభుత్వం బోనస్ అందిస్తుందని చెప్పారు. రైతులు పండించిన చివరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎవరు ఆందోళన చెందవద్దన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద నిర్వాహకులు రైతులకు తగిన ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ తోడ్పాటుతో ఆహార ధాన్యాల ఉత్పత్తిలో తెలంగాణ దేశంలో అగ్రభాగాన నిలిచిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని మార్కెట్ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా, మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా, సర్పంచ్ రాయికంటి బిక్షపతి, ఉపసర్పంచ్ యాదగిరి రెడ్డి, డైరెక్టర్ తాళ్ల రవీందర్, వార్డు సభ్యులు భాను కిరణ్, సింగల్ విండో డైరెక్టర్ చేగూరి వెంకటేష్, నాయకులు చందోజీ, జహంగీర్ బాబా, జహంగీర్ అలీ, వెంకట్ రెడ్డి, దారెడ్డి అంజన్ రెడ్డి, రాములు, బిక్షపతి, ఏపీఎం రాములు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి నిర్మాణానికి ' ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ' చేయూత



**ఆమనగల్లు, మే 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డుకు చెందిన తల్లోజు ఈశ్వరమ్మ ఇంటి నిర్మాణానికి మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ఉప్పల వెంకటేష్ సహకారంతో చేయూతనందించారు. ఈశ్వరమ్మ ఇంటి నిర్మాణానికి 50 సిమెంట్ బ్యాగులను శనివారం కౌన్సిలర్లు నాగిళ్ళ జగన్, పుల్లారెడ్డి అనూష శ్రీశైలం చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కల్వకుర్తి నియోజకవర్గంలో పేదలను ఆదుకోవడమే ఉప్పల వెంకటేష్ లక్ష్యమని తెలిపారు. గూడు లేని నిరుపేదలకు చెందిన ఇండ్ల నిర్మాణానికి ఆదుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, ఉప సర్పంచ్ కోటేశ్వర్, నాయకులు రవి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల భద్రత కోసమే తనిఖీలు

- ఎస్సై కురుమూర్తి




**వెల్దండ, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** శ్రీశైలం--హైదరాబాద్ జాతీయ రహదారిపై స్థానిక ఎస్సై కురుమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ప్రజల భద్రత కోసం పోలీసులు ప్రతిరోజూ తనిఖీలు చేపడుతున్నారని, ప్రతి వాహనాన్ని పరిశీలిస్తూ టూ--వీలర్ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. పోలీసుల సూచనలు పాటిస్తే ప్రమాదాలు తగ్గుతాయని, వాహనదారులు వేగాన్ని తగ్గించి ప్రాణాలను రక్షించుకోవాలని వారు వివరించారు.

## చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్



**ఆమనగల్లు, మే 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు లండం చిన్న జంగయ్య అన్నారు. ఆమనగల్లు పట్టణానికి చెందిన గన్నోజు గీత గణేష్ దంపతుల కుమార్తె హాసిని ప్రభుత్వ కళాశాలలో చదువుతూ ఇంటర్ మొదటి సంవత్సరం (బైపిసి) లో 949 మార్కులు సాధించింది. అదేవిధంగా సముద్రాల మంజుల వెంకటేష్ ల కూతురు హిమబిందు పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపింది. 600 మార్కులకు గాను 562 మార్కులు సాధించింది. ఈ మేరకు అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆయా విద్యార్థుల నివాసాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను వారి తల్లిదండ్రులను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు లండం చిన్న జంగయ్య మాట్లాడుతూ.. కష్టపడి చదివి భవిష్యత్ లో గొప్ప స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యువజన సంఘం ఉపాధ్యక్షులు వస్పుల సురేష్, సభ్యులు వస్పుల రంజిత్, నాగిళ్ళ లక్ష్మణ్, మీసాల రమేష్, ఎండీ అఫ్సర్, పాత్లవత్ రవి, మద్దెల మల్లేష్, లండం యాదయ్య, లండం శివ, గుజ్జరి గోపి, చలిచీమల సతీష్, జంతుక చిన్న, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ భృతి, రాజీవ్ యువ వికాస్ పథకాలపై తీవ్ర విమర్శలు



**హుస్నాబాద్, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రాష్ట్రంలో నిరుద్యోగ భృతి, రాజీవ్ యువ వికాస్ పథకాలను అమలు చేయకపోవడంపై డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి. తిరుపతి తీవ్రంగా విమర్శించారు. అర్హులైన నిరుద్యోగ యువతకు సబ్సిడీ రుణాల ద్వారా స్వయం ఉపాధి కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా, ఇప్పటి వరకు ఎంపిక ప్రక్రియ చేపట్టకపోవడం నిర్లక్ష్యమని అన్నారు. 2025 జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎంపిక పత్రాలు అందజేస్తామని చెప్పి, ఇప్పటికీ అమలు చేయకపోవడం సిగ్గుచేటు అని ఆయన వ్యాఖ్యానించారు. నిరుద్యోగ భృతి పేరుతో 4016 రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చి, నోటిఫికేషన్లు విడుదల చేయకపోవడం వల్ల యువత ఆశలు నిర్వీర్యం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో లక్షల రూపాయలు ఖర్చు చేసి ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్న యువతకు ప్రభుత్వం నిరాశ కలిగిస్తోందని ఆయన అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చిత్తశుద్ధి చూపి నిరుద్యోగ భృతి, రాజీవ్ యువ వికాస్ పథకాలను అమలు చేసి, ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువత హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అవసరం ఉందని తిరుపతి స్పష్టం చేశారు.

## ఆమనగల్లు జూనియర్ సివిల్ కోర్టు జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన అరుణ్ కుమార్






**ఆమనగల్లు, మే 02 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు జూనియర్ సివిల్ కోర్టు జడ్జిగా నారం అరుణ్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఆయనకు స్థానిక పోలీస్ అధికారులు ఘన స్వాగతం పలికి పూలమొక్క అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్జి అరుణ్ కుమార్ మాట్లాడుతూ, కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. న్యాయవ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగేలా పారదర్శకంగా సేవలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడుగుల పోలీస్ స్టేషన్‌ల ఎస్‌హెచ్‌ఓలు వెంకటేశ్వర్లు, జానకిరామ్ రెడ్డి, సైదిరెడ్డి, వేణుగోపాల్ రావు, ఎస్ఐ సీతారాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు సర్పంచ్ శిరీషలోకేష్ గౌడ్ అండ




**మర్రిగూడ, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** మండల కేంద్రంలోని ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశాలను స్థానిక సర్పంచ్ వీరమళ్ళ శిరీషలోకేష్ గౌడ్ సందర్శించారు. కూలీల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో గ్రామంలో మరిన్ని పనులు కల్పించాలని సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలకు ఇబ్బంది కలగకుండా టెంట్ ఏర్పాటు చేసి, మంచినీటి క్యాన్లు, శీతల పానీయాలు అందజేశారు. అదనంగా కూలీల ఆరోగ్య రక్షణ కోసం ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని గ్రామ ఆశావర్కర్లకు సూచించారు. మండల వైద్యశాఖ అధికారులు కూడా పని ప్రదేశాల్లో కూలీలకు అవసరమైన వైద్య సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యూసుఫ్, ఫీల్డ్ అసిస్టెంట్ శారద, వార్డు సభ్యులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## బెల్ట్ షాపులపై సర్పంచ్ హెచ్చరిక

**మర్రిగూడ, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గ్రామపంచాయతీ పరిధిలో బెల్ట్ షాపులు నిర్వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామని సర్పంచ్ వీరమల్ల శిరీష లోకేష్ గౌడ్ హెచ్చరించారు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామాలలో శాంతిభద్రతలు కాపాడటంతో పాటు ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామపంచాయతీ పాలక మండలి తీర్మానం ఆమోదించిందని తెలిపారు. ఆ మేరకు మర్రిగూడ గ్రామపంచాయతీ పరిధిలో అన్ని బెల్ట్ షాపులను నిషేధించామని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా మద్యం విక్రయాలు జరిపినట్లు తేలితే గ్రామపంచాయతీ తరపున రూ. 25,000 జరిమానా విధిస్తామని, అదనంగా సంబంధిత శాఖ ద్వారా చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ కార్యదర్శి యూసుఫ్, ఇతరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీకి పునాది సేవాదళ్..

**శిక్షణ శిబిరంలో కాంగ్రెస్ నేత హనుమంత రావు**



**ఆమనగల్లు, మే 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** కాంగ్రెస్ పార్టీకి పునాది సేవాదళ్ కార్యకర్తలేనని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ సలహాదారుడు వి.హనుమంత రావు అన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్లో జరుగుతున్న పీసీసీ సేవాదళ్ మూడు రోజుల శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా సేవాదళ్ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. 140 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి సేవాదళ్ వెన్నుదన్నుగా నిలుస్తూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తుందని చెప్పారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంలోనూ సేవాదళ్ చేసిన కృషి మరువలేనిదని గుర్తుచేశారు. నిస్వార్థంగా పని చేసే కార్యకర్తలు పార్టీకి వెన్నెముక లాంటి వారని ప్రశంసించారు. కష్టపడి పనిచేసే సేవాదళ్ కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. పార్టీ పరంగా కూడా వీరికి సముచిత స్థానం కల్పించాలని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హనుమంత రావు పేర్కొన్నారు. అనంతరం సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి కానుగుల దశరథం కు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సేవాదళ్ అధ్యక్షులతో పాటు పలువురు సీనియర్ నాయకులు రాష్ట్రవ్యాప్తంగా సేవాదళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మత్తుకు బానిస కావద్దు.. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

**- ఎక్సైజ్ సీఐ బధ్యనాథ్ చౌహాన్**




**ఆమనగల్లు, మే 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మత్తుకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ బధ్యనాథ్ చౌహాన్ అన్నారు. మాదక ద్రవ్యాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శనివారం పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్సై, కానిస్టేబుల్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులకు ఆమనగల్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్య వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ బధ్యనాథ్ చౌహాన్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తిగత, కుటుంబ, సామాజిక జీవితంపై ప్రభావం చూపుతాయని అన్నారు. యువత మాదక ద్రవ్యాల ప్రభావానికి గురికాకుండా ఆరోగ్యకరమైన జీవనాన్ని గడపాలని పిలుపునిచ్చారు. యువత, ప్రజలందరి సహకారంతో పోరాడితేనే మాదక ద్రవ్యాల వినియోగం నివారించవచ్చునని తెలిపారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ తమ సామాజిక బాధ్యతను గుర్తు చేసుకొని దేశ నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోసూచించారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ లు అరుణ్ కుమార్, స్వప్న సిబ్బంది చెన్న గౌడ్, శ్రీను, శివ ప్రసాద్, లింగం, సాయి, శ్రీజ తదితరులు ఉన్నారు.

# అమరవాది ప్రమాణస్వీకార సభ

**- ఆంధ్రా నాయకుల సభగా మారింది**



**హైదరాబాద్, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అమరవాది ప్రమాణ స్వీకార సభ కాస్తా ఆంధ్రా నాయకుల సభగా మిగిలిపోయిందని ఆర్యవైశ్య నాయకుడు మిడిదుడ్డి శ్యాంసుందర్ విమర్శించారు. తెలంగాణ ఆర్యవైశ్య ప్రముఖులు, నాయకులు మూకుమ్మడిగా సభను బహిష్కరించడంతో అమరవాది వర్గం పరువు బజారున పడిందని ఆయన మండిపడ్డారు.తెలంగాణ వైశ్య పితామహుడు గంజి రాజమౌళి గుప్తా, ఎమ్మెల్సీ బొగ్గారాపు దయానంద్, ఎమ్మెల్యే దన్‌పాల్ సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గణేష్ గుప్త, వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుజాత, మాజీ చైర్మన్లు కోలేటి దామోదర్, ఉప్పల శ్రీనివాస్ గుప్త, బొల్లం సంపత్ తదితరులు హాజరుకాకపోవడం గమనార్హమని ఆయన పేర్కొన్నారు. ప్రోటోకాల్ ఉన్న నాయకులు సైతం ఈ అక్రమ ఎన్నిక గెలుపును సమ్మతించక బహిష్కరించడం గమనించదగ్గ విషయమని అన్నారు.శ్యాంసుందర్ మాట్లాడుతూ అమరవాదికి ఆంధ్రానే దిక్కు అయ్యిందని ధ్వజం ఎత్తారు. 11 సంవత్సరాలుగా అప్రమాణికంగా ఉన్న అమరవాది వర్గానికి తెలంగాణ ఆర్యవైశ్యులు బుద్ధి చెప్పారని వ్యాఖ్యానించారు. గతంలో శ్రీశైలం సత్రంలో తెలంగాణ పేరు పెట్టడాన్ని విమర్శించిన అమరవాది, ఇప్పుడు ఆంధ్రా వారితోనే ఆధారపడటం విడ్డూరమని ప్రశ్నించారు. 2--3 ఓట్ల తేడాతో గెలుపు గెలుపు కాదని, స్వచ్ఛమైన నీతి--నిజాయితీ ఓట్లు 520 వచ్చాయని, డబ్బు--అంగబలం--అధికారంతో గెలిచామనుకోవడం భ్రమ అని ఆయన స్పష్టం చేశారు. కోర్టు ద్వారా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కొద్దిమంది రైస్ మిల్లర్లతో సభ జరిపి ప్రమాణ స్వీకారం చేసుకోవడం విఫల ప్రయత్నమని ఎద్దేవా చేశారు.అక్రమ పదవి శాశ్వతం కాదని, ఉప్పల్‌లో కానీ మహాసభలో కానీ అన్యాయం జరిగితే పోరాటం తప్పదని ఆయన హెచ్చరించారు. పదవులు, బానిసత్వం, వ్యాపారం కోసం కొందరు ఉండవచ్చని, కానీ ఆత్మాభిమానం, పౌరుషం, న్యాయం, ధర్మం ఉన్న ఆర్యవైశ్య సంఘం ఎప్పుడూ వ్యతిరేకిస్తుందని, అవసరమైతే సత్తా--బలం--పోరాటం చూపిస్తామని ఆయన స్పష్టం చేశారు.తెలంగాణ నాయకులు పూర్తిగా దూరం పెట్టడంతో అమరావతి వర్గం ఏకాకి అయిందని, తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ పేరుతో ఆంధ్రా వారితో సభ జరపడం విడ్డూరమని ఆర్యవైశ్య సామాజిక వర్గం నేతలు చర్చించుకున్నారు.

# యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

**కలెక్టర్ చంద్రశేఖర్**



**నల్లగొండ, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శనివారం నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో మాదకద్రవ్యాల దుర్వినియోగం నివారణపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ యువత ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలంటే చెడు అలవాట్లు, వ్యసనాలను దూరంగా ఉంచుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగితేనే విజయాన్ని సాధించగలరని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబం, సమాజానికి తీవ్ర హానిని కలిగిస్తుందని హెచ్చరించారు. డ్రగ్స్ వినియోగం వల్ల మెదడు, గుండె, కాలేయం దెబ్బతింటాయని, చదువుపై దృష్టి కోల్పోవడం, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, నేరాలకు దారితీసే పరిస్థితులు ఏర్పడతాయని వివరించారు. ఎవరైనా డ్రగ్స్ ఆఫర్ చేసినప్పుడు స్పష్టంగా "కాదు" అని చెప్పాలని, అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినప్పుడు వెంటనే 100 లేదా 1908 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, డీఎస్పీ శివరాం రెడ్డి, సీఐలు రాఘవరావు, రాజశేఖర్ రెడ్డి, మహాలక్ష్మయ్య, ఉమెన్ ఉ చైల్డ్ సేఫ్టీ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతీ ఒక్కరు భక్తి భావం కలిగి ఉండాలి

**- కౌన్సిలర్ పాపిశెట్టి రాము**



**ఆమనగల్లు, మే 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ప్రతీ ఒక్కరు భక్తిభా వం కలిగి ఉండాలని ప్రముఖ సంఘ సేవకులు, ఆమనగల్లు 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము అన్నారు. వెల్దండ మండల పరిధిలోని కోట్ర గ్రామంలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవం శ్రీ కంఠమహేశ్వర స్వామి, శివుడు, పోచమ్మ, మైసమ్మ విగ్రహాల ప్రతిష్ట ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. సందర్భంగా విగ్రహాల ఊరేగింపుగా నిర్వహించారు.. శనివారం కౌన్సిలర్ పాపిశెట్టి రాము ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ నిర్వాహకులు శాలువాలతో సన్మానించారు. భక్తులు హోమాలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు వంశీకృష్ణ శర్మ, రాఘవ శర్మ, కృష్ణ తేజ శర్మ, సూరజ్ శర్మ, భరత్ కుమార్ శర్మ, చంద్రకాంత్ శర్మ, నాయకులు శ్రీను నాయక్, అనంతుల సైదులు గౌడ్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నూతన సీఐ కు సన్మానం




**ఆమనగల్లు, మే 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** కడ్తాల్ నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ సైదిరెడ్డి ను ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బాలరాజు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీఐ సైదిరెడ్డి మాట్లాడుతూ.. గ్రామములో అందరు కలిసిమెలిసి ఉండాలని, శాంతిభద్రతలకు అందరు సహకరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదు, అనేలైన్ సైబర్ మోసగాళ్ల వలలో పడకూడదని ఎవ్వరైనా అనుమాస్పదంగా ఊర్లలోకి వస్తే మాకు సమాచారం ఇవ్వాలని అన్నారు. కలిసిన వారిలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్, వార్డు సభ్యులు యాదయ్య తదితరులు ఉన్నారు.

# లింగాల మండలంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**లింగాల, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** లింగాల మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర నాయకుడు రంగినేని శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు, మాజీ వైస్ ఎంపీపీ నారాయణ గౌడ్ మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోందని పేర్కొన్నారు.స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ నేతృత్వంలో మండలం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, సాగునీటి సౌకర్యాల నుంచి పండించిన ప్రతి గింజను మద్దతు ధరతో కొనుగోలు చేసే వరకు ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని వివరించారు. రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.మండలంలోని రైతు సోదరులంతా ఈ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని నారాయణ గౌడ్ కోరారు.ఈ కార్యక్రమంలో లింగాల పట్టణ సర్పంచ్ పూజారి ఈశ్వరమ్మ బుడ్డయ్య, వ్యవసాయ అధికారులు, అచ్చంపేట మార్కెట్ డైరెక్టర్ ముక్తార్, జిల్లా మహిళా అధ్యక్షురాలు భాగ్యభాయ్ శంకర్ రాథోడ్, జిల్లా సెక్రటరీ, రాయవరం గ్రామ మాజీ సర్పంచ్ మల్లయ్య, శ్రీ ఉమామహేశ్వర దేవస్థానం డైరెక్టర్ ఇందిరమ్మ, మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నాయక్, పట్టణ వార్డు సభ్యులు గుత్తి వెంకటయ్య, సాయి రెడ్డి, కావేటి తరుణ్, కురువ శ్రీశైలం, శివాజీ, నందిని తదితర స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## గంజాయి సప్లై చేస్తున్న గాంజా గ్యాంగ్ అరెస్ట్ చేసిన టూ టౌన్ పోలీసులు






**నల్లగొండ, మె 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆంధ్ర--ఒడిశా బోర్డర్ నుంచి నల్గొండకు గంజాయి సప్లై చేస్తున్న ఐదుగు ముఠా సపోలీసుల సడెన్ రైడ్‌తో పట్టుకున్నారువారి వద్ద నుంచి సుమారు 3 లక్షలు విలువ చేసే 5 కిలోల గంజాయి సీజ్ ,రెండు పల్సర్ బైకులు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నాడు ఉడిపి హోటల్ దగ్గర గుట్టుగా డీల్ చేస్తూ చిక్కిన యువకులు చూసి చూసి పారిపోదాం అనుకున్న వారి ప్లాన్ ఫెయిల్ -- వెంటనే పట్టేసిన టూ టౌన్ పోలీసులుఒక్క కేజీ 3 వేలకే కొనుగోలు చేసి నల్గొండలో భారీ రేటుకు అమ్మకం ఫ్రెండ్స్ గ్యాంగ్‌గా మొదలై గంజాయి బిజినెస్‌గా మార్చారు ముఠాలోని ఇంకా 6 మంది పరారీలో ఉన్న వారి కోసం పోలీసుల వేట కొనసాగుతోంది గంజాయి అంటే జైలు టికెట్ ఖాయం.. అంటూ అడిషనల్ ఎస్పీ జి రమేష్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు నలగొండ డిఎస్పి శివరాం రెడ్డి నేతృత్వంలో టూ టౌన్ సీఐ ఎస్..రాఘవ రావు,ఆద్వర్యంలో ఎస్సై వై.సైదులు మరియు వారి సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ పి.రాజు,మరియు కానిస్టేబుల్ ఎల్.బాలకోటి,ఎండి.షకీల్ లను జిల్లా ఎస్పీ అభినందించారు.

## కరీంనగర్‌లో డ్రగ్స్‌పై ముమ్మర తనిఖీలు



**కరీంనగర్, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టేందుకు పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. కమిషనర్ గౌష్ ఆలం ఆదేశాల మేరకు నగరంలోని గోదాములు, గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలు, అనుమానాస్పద ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. టీఎస్‌ఎస్‌పి సిబ్బంది కూడా ఈ ఆపరేషన్‌లో భాగమయ్యారు. సరిహద్దు ప్రాంతాలు, ప్రధాన కూడళ్ల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ, అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తుల వివరాలను సేకరిస్తున్నారు. గూడ్స్ కార్యాలయాల్లో పార్సిళ్లు, గోదాముల్లో నిల్వ సరుకులను కూడా తనిఖీ చేస్తున్నారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ కార్యకలాపాలను ఏమాత్రం సహించబోమని అధికారులు స్పష్టం చేశారు. చట్టవిరుద్ధ పనులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు కూడా తమ పరిసరాల్లో అనుమానాస్పదంగా ఏదైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాజానికి చేటు చేసే డ్రగ్స్‌పై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారని అధికారులు తెలిపారు.

## ఆదిత్య నగర్‌లో 'పీఎం సూర్య ఘర్ యోజన' అవగాహన కార్యక్రమం

**బడంగ్ పేట, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతిష్టాత్మక పథకం లి"ప్రధానమంత్రి సూర్య ఘర్ -- ముఫ్త్ బిజిలీ యోజన"లిపై అవగాహన కల్పించేందుకు ఆదిత్య నగర్ ఫేజ్--3 మరియు గుర్రంగుడ ప్రాంతాల్లో శనివారం సాయంత్రం స్వచ్ఛంద బృందం కార్యక్రమం నిర్వహించనుంది.సాయంత్రం 6 గంటలకు కాలనీ ప్రధాన కూడలిలో జరిగే ఈ కార్యక్రమంలో పథకం అమలు విధానం, సబ్సిడీ, ఉపయోగాలు గురించి స్థానిక వాసులకు వివరించనున్నారు.కాలనీ ప్రెసిడెంట్ పగిడోజు ప్రవీణ్ మాట్లాడుతూ వాసులందరూ సకాలంలో హాజరై సూచనలు విని, పథకం ద్వారా లాభపడటంతో పాటు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.పర్యావరణ పరిరక్షణ సమితి చైర్మన్ నరేష్ దండు మాట్లాడుతూ ఈ పథకం ద్వారా కరెంట్ బిల్లుల భారం తగ్గడంతో పాటు సౌర విద్యుత్ వినియోగం పెరిగి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తోడ్పడాలని పిలుపునిచ్చారు.

# ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం -- ఒక ఆత్మపరిశీలన




ప్రతి సంవత్సరం మే 3న జరుపుకునే ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవంను యునైటెడ్ నేషన్స్ 1993లో అధికారికంగా ప్రకటించింది. 1991లో ఆఫ్రికా ఖండంలోని విందోక్లో జరిగిన సమావేశంలో తీసుకున్న తీర్మానం ఆధారంగా ఈ దినోత్సవానికి రూపం దక్కింది. పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని గుర్తు చేస్తూ ప్రతి సంవత్సరం ఈ రోజు జరుపుకుంటారు. అయితే,మే 03న వేడుకలు జరుపుకుంటున్నప్పటికీ, పత్రికల పట్ల ప్రజల్లో నమ్మకం తగ్గిపోవడం ఒక ఆందోళనకర పరిణామం. ఒకప్పుడు పత్రిక అంటే ప్రజల కళ్లూ, చెవులూ. కానీ నేడు అదే పత్రికను చదవడానికి ప్రజలు వెనుకంజ వేస్తున్నారు. ఎందుకు? ముఖ్య కారణం వ్యవస్థల వైఫల్యం. అధికార యంత్రాంగం తమ అనుభవాన్ని ఆయుధంగా మార్చుకొని లోపాలను దాచిపెట్టి, సాధారణ ప్రజలను తప్పుదారి పట్టించే పరిస్థితి పెరిగింది. కళ్ల ముందు అన్యాయం జరిగినా, రాతపూర్వక ఫిర్యాదు లేకపోతే చర్యలు తీసుకోని నిర్లక్ష్యం ప్రజల్లో నిరాశను నింపుతోంది. ఇక ప్రజాప్రతినిధులు చట్టాలను తమ చేతుల్లోకి తీసుకొని, అధికారులను కీలుబొమ్మలుగా మార్చడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. ఇక పత్రికల విషయానికి వస్తే---ప్రధాన సమస్య వాణిజ్య ధోరణి పెరగడం. ప్రజా సమస్యల కంటే ప్రకటనలకే ప్రాధాన్యం ఇవ్వడం, పుట్టగొడుగుల్లా పత్రికలు పుట్టడం, వాస్తవాలున్న వార్తలు కూడా ప్రజలకు ఉపయోగపడని స్థితి రావడం--- అన్ని విలువలు బలహీనపడ్డాయి. కొంతమంది యాజమాన్యాలు ఆర్థిక లాభం కోసం ఎవరికైనా వేదిక ఇవ్వడం, నైతిక విలువలను పక్కన పెట్టడం జర్నలిజాన్ని దెబ్బతీస్తోంది. ఇది మాత్రమే కాదు---ప్రజల్లో కూడా విసుగు పెరిగింది. ఎన్నికలలో అక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలులో అవకతవకలు, నిరసన తెలిపిన వారిపై ఒత్తిళ్లు---ఈ అన్నీ కలిసి ప్రజాస్వామ్యంపై నమ్మకాన్ని తగ్గించాయి. ఫలితంగా ప్రజలు కేవలం ఓటు వేసే స్థాయికి మాత్రమే పరిమితమవుతున్నారు. ఈ నేపథ్యంలో నిజాయితీగా పనిచేసే కొద్దిమంది జర్నలిస్టుల పరిస్థితి మరింత దుర్భరంగా ఉంది. నిజం రాస్తే శత్రువులు పెరుగుతారు. ఆర్థికంగా కష్టాలు, సామాజికంగా ఒత్తిళ్లు---ఇవి వారి నిత్యజీవితంలో భాగమయ్యాయి. అయినా వారు వెనుకడుగు వేయకుండా పోరాడుతున్నారు. కానీ వారికి సరైన గుర్తింపు లేకపోవడం బాధాకరం. ఈ పరిస్థితిని మార్చాలంటే, మన సమాజానికి మళ్లీ విలువలతో కూడిన నాయకత్వం అవసరం. డా బి . ఆర్ . అంబేద్కర్ , మహాత్మా గాంధీ , సుభాష్ చంద్ర బోస్ , సురవరం ప్రతాప్ రెడ్డి , షూబుల్లాహ్ ఖాన్ వంటి మహనీయుల స్ఫూర్తి మళ్లీ రావాలి. నిజం కోసం, న్యాయం కోసం, ప్రజల కోసం పోరాడే ఆత్మవిశ్వాసం తిరిగి పెరగాలి.

ఈ సందర్భంగా నేను ఇచ్చే సందేశం
పత్రికా స్వేచ్ఛ అనేది కేవలం జర్నలిస్టుల హక్కు కాదు---అది ప్రజల హక్కు. పత్రికలు నిజం చెప్పాలి, ప్రజలు వాటిని చదవాలి, వ్యవస్థలు వాటిని గౌరవించాలి. ఈ మూడు కలిసినప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుంది.

ఈ ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా---
"సత్యం రాయడం మా బాధ్యత, సత్యాన్ని నిలబెట్టడం సమాజ బాధ్యత" అనే నమ్మకంతో ముందుకు సాగుదాం.

వ్యాసకర్త
గంగవరం రామకృష్ణారెడ్డి



# చెరువుల పరిరక్షణకు కమిటీలు ఏర్పాటు



**హైదరాబాద్, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ రాష్ట్రంలో చెరువుల పరిరక్షణ, సమర్థవంతమైన నిర్వహణ కోసం స్థానిక స్థాయిలో చెరువుల పరిరక్షణ కమిటీలను తక్షణం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.ఈ కమిటీల ద్వారా చెరువుల ఎగువ భాగంలోని నీటి పరివాహక ప్రాంత అభివృద్ధి, నిల్వ సామర్థ్యం పెంపు కోసం పూడికతీతలు, తూములు--అలుగుల పటిష్టీకరణ, ఆయకట్టులో నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే చర్యలు చేపట్టనున్నారు. సమగ్ర నీటి యాజమాన్యంలో భాగంగా శాస్త్రీయ నీటిపారుదల పద్ధతులను అవలంబిస్తూ ఈ కార్యక్రమాలను అమలు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు.కమిటీలలో స్థానిక రైతులు, పంచాయతీరాజ్ సంస్థల ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, చిన్న నీటిపారుదల శాఖ అధికారులు సభ్యులుగా ఉంటారని, నామినేషన్ పద్ధతిలో రెండు సంవత్సరాల కాలపరిమితితో నియమించాలని సూచించారు.ఈ అంశాలపై జలసౌధలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమక్షంలో జరిగిన సమావేశంలో వ్యవసాయ--రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు కేవీఎన్ రెడ్డి, భవాని రెడ్డి, రాములు నాయక్, కమిషన్ అధికారులు గోపాల్, డాక్టర్ కేశవులు, బి. హరి వెంకట ప్రసాద్ పాల్గొన్నారు.అదేవిధంగా ఎక్స్పర్ట్ కమిటీ సభ్యులు డబ్ల్యూ.ఆర్. రెడ్డి (విరమించిన ఐఏఎస్), డాక్టర్ కె. ఎల్లారెడ్డి (అంతర్జాతీయ నీటి యాజమాన్య నిపుణులు), ఎం. చంద్రశేఖరరావు (స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు), లూబ్నా సర్వత్ (సామాజిక కార్యకర్త) హాజరయ్యారు.పైలట్ ప్రాజెక్టుల సమర్థవంతమైన అమలు కోసం ఈ కమిటీ ప్రభుత్వం తీసుకునే చర్యలకు నిరంతరం మద్దతు అందిస్తుందని సమావేశంలో వెల్లడించారు.

## రేపు ఎస్సీ కార్పొరేషన్ యూనిట్ ఇంటర్వ్యూలు


అభివృద్ధి అధికారి భాస్కర్ రావు

**ఎలిగేడు, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఎస్సీ కార్పొరేషన్ 2025--26 సంవత్సరానికి సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు రేపు (మే 4, సోమవారం) ఎలిగేడు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో భాస్కర్ రావు తెలిపారు.అభ్యర్థులు తప్పనిసరిగా ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని ఆయన సూచించారు.

## ఎలిగేడు లో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ఎలిగేడు, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యాన్ని మద్దతు ధరతోనే కొనుగోలు చేస్తామని సర్పంచ్ రాధ గంగా జమున--వేణుమాధవరావు తెలిపారు.ఎలిగేడు మండలం లోకపేట గ్రామంలో ధూళికట్ట సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నియోజకవర్గంలో ఎటువంటి కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు జరుగుతోందని, రైతులు తూకం వేసిన 48 గంటల్లోగా వారి ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని పేర్కొన్నారు. రైతులు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సహకార సంఘం సీఈఓ బద్ధం రవీందర్ రెడ్డి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, సంఘు సిబ్బంది, రైతులు, హమాలీలు పాల్గొన్నారు.

# నీలగిరి సాహితీ సంగమం

## దత్తపదులు

ఆటవెలది

(కరువు)కాలమందు కలిసివచ్చినదని
(అరువు)చేయబోకు నధికముగను
బ్రతుకునందు నదియె (బరువు)గా యనిపించి
(చెరువు)వలెను నేడ్వ చేరరెవరు

ఆటవెలది

(హరిత) వనములెల్ల హరియించ సాగిరి
(మమత) సమతలేని మనుషులెల్ల
గతపు (సరిత) తెలిపి హితము చేకూర్చగా
(కవిత) రాయగాను కలము దీస్తి

ఆటవెలది

(శక్తి) కొలది నీవు రక్తితో దేవికి
భజనజేసి మొక్క(భక్తి) మెరసి
(యుక్తి)ని గని దేవి ఉత్సాహముప్పొంగి
(ముక్తి)ని కలిగించు ముదముగాను

విజయప్రసాద్ నలుమాసు
కరీంనగర్

## న్యస్తాక్షరి

తే.గీ.

(ప)తితపావన పరమేశ పాపనాశ!
(రా)జధర శివా పార్వతీరమణ శూలి!
(భ)క్తపరిపాలకా హరా భవ్యచరిత!
(వ)రదహస్తా మహాదేవ వాయులింగ!!

తే.గీ.

(ప)రమపావని జగదంబ (ప)ద సుమములు
(రా)గయుతముగ కీర్తింతు (రా)త్రిబవలు
(భ)జనసేయుచు గడిపెద (భ)క్తిమీర
(వ)దలకను పట్టి పూజింతు (వ)శముగాగ!!

కవికోకిల తిప్పారపు
లక్ష్మీ నర్సయాచార్యులు వెదిర

## ఆ!!వె!! ప్రహేళిక

అక్కపిల్లలుండు అత్తవారింటను
కొత్త కోడలుండు కోమటింట
ఉప్పుపప్పులుండు కోమలి కొప్పున
మల్లెమాల నల్లి మంచమందు!!

బండరాయి జారు బడిలోన పిల్లలు
చదువు పంది కూన పరగ బొర్లు
బురదను గని కోడిపుంజులు ప్రొద్దున
కూయు తేలు ప్రాకు గోడ పైన!!

ఉంగరాలజుట్టు ఊడుచుండు నెమలి
నాట్యమాడు వనది నక్కమాట
నమ్మరాదు పలుకులమ్మను మ్రొక్కిన
బుద్ధినొసగు వాగు పొంగుచుండు!!

గడ్డం కృష్ణారెడ్డి!రేపాల!
సూర్యాపేట!

## మాతృభాష:-

ఆటవెలది:-

మాతృభాషనెపుడు మరుగుపరచవద్దు
అన్యభాషలింకనాదరించు
అమృత తుల్య భాష యాలోచనలకూత
అమ్మ భాష మనకునాది భాష.

ఆటవెలది:-

అమ్మ భాష మనకు నానందములనిచ్చు
వినగ,అనగ, చదువ వీలు కలుగు
సులభ గ్రాహ్యమునకు సుందరమగు భాష
అమ్మ భాషకన్ననన్యమేది?

తేటగీతి:-

మాతృభాషలోన చదువు మర్మమెఱుగు
మాతృభాషలోన పలుకు మన్ననిచ్చు
పద్య,గద్య పఠనములఁ బదిల పఱుచు
పఠిత బాలకులకునింపు కఠినమవదు
అట్టి విద్యల నేర్వగ హాయిగుండు.

కశోర్ఝుల నాగేశ్వర్ శర్మ,
ధర్మపురి.

## సరస్వతి ప్రార్థన

ఆ వె
జ్ఞాన భిక్ష పొంది క్రైతలు వ్రాయశీగ
బుద్ధి మాంద్యమశీత పోవగాను
జ్ఞాన బుద్ధి నెపుడు కలిగియుండునటుల
నలువ రాణి నీకు నమసు లిడుదు.

ఆ. వె.
పద్యవిద్యనేర్వ పంతమ్ము పట్టితిన్
గుర్వనుగ్రహమ్ము కుదురుకొంటి
శతకరచన కొరకు శరణుకోరుచునుంటి
జ్ఞానభిక్ష నొసగు జ్ఞానమూర్తి!

గురు వందనం

ఆ వె
దైవమతడు గురువుధరణిలోన మనకు
దారిచూపునతడు దార్శనికుడు
కిటుకులెన్నొ చెప్పు కృషిచేయ మనుచును
అంజలింతుమయ్య అభయ దాత!

డా జి భవానీ కృష్ణమూర్తి
హైదరాబాద్

## శీర్షిక: భారతీయ విధి విధానములు

సీసము:

ఎవరు చెప్పవలయునీ పాఠములనెల్ల?
మొండి తనము తోడ మూర్ఖులగుచు
వేరు జీవితములు కోరి విడచి పల్లె!
న'గర'మందున నొందు నగవులేవి?
శాస్త్రరంగములతో సంప దల్ వర్ధిల్లు
చిన్న చోట్లన యైన! చిన్న తనమ?
భేషజములతోడ బింకంబు తరుగును
నిజము తెలుసు కొమ్ము నిమ్మళముగ//

తేటగీతి మాలిక:

స్వంత సంస్కృతిని మఱచి స్వార్థ గుణము
తోడ పలుచన చేసెడి దుష్ట జనులె
యెరుగరైతిరిందు నిజము లేవి చూడ
యితరులెవరు చేయరె! యిట్టి యింగితములు
లేని వ్యాఖ్యలు పనులును! లేకి తలపు
లన్ని మన వాటి పైననే హర్షమేమొ!
పరుల పలుకులైనను వీని వసను తీసి
మార్చలేవె యేమొ! భవిత మసియె యింక.//

ఇరువంటి నాగ దుర్గా మాధురీ దేవి ఆనాగినిరి
భాగ్యనగరము

## తెలుగు వైభవము

చం.
అహరహ చింతనం బునను నాంధ్రము నాదిగ భారతంబును
న్మహితము నందజేసిరిల నన్నయ యెఱ్ఱన తిక్కనార్యులున్
విహితపు లక్షణంబులను విస్తృత పర్చిరి లక్షణార్యులున్
వహికము తెల్గువారికిని భవ్యము దివ్యము నాంధ్ర భాషయున్

ఉ.
ఇంతలు గన్నులుండ తెరువెవ్వరి వేడెద వంచు పెద్దనన్
సంతసమింతలేదు మృగశాప వశంబున నంచు పోతనన్
కాంతి మనోహరాంగులగు కన్నె లటంచును చేమకూరయున్
యెంతయొ సేవ జేసితిరి యిమ్ముగ తెన్గున యుత్పలంబులన్

తే.గీ
మొదట నన్నయ తెనిగించి మురిసె మదిని
తెలిపె కృష్ణరాయ ప్రభువు తెలుగు ఖ్యాతి
సీస పద్యంబు శ్రీనాధ్నఁ జెలియ గాదె
తెలుగు వైభవ మిదియని తెలుపతరమె

బొలిశెట్టి సత్యనారాయణ
హైదరాబాద్

## శీర్షిక-శ్రీలలితా

ఉ.
లాలిత ధర్మమార్గమతి రాజకిరీటి !నవోజ్జ్వలాకృతీ!
పాలిత దివ్యలోక మణి భాసిత పాదసరోజయుగ్మ!నీ
చాలన మెంతసౌఖ్యమది , సర్వజగాలకు శాంతిమార్గమౌ
శ్రీలలితా!దయా కలిత చిన్మయి బ్రోవవె!భక్తపాలినిన్.

శా.
శ్రీమాతా-శివవామభాగనిలయా!శ్రీచక్రసంచారిణీ!
ధీమాన్యార్చిత!శాంకరీ!వరమతీ!తేజోవిశేషావృతా!
రామా!రాజకిరీట భూషవిలసత్ రమ్యాకృతీ!శాంకరీ!
శ్రీమత్సాధుజనావనోద్యమసదాక్షిణ్యాత్మ సర్వంసహా!

డా.గాయత్రీదేవి

## మాతృభాష:-

ఆటవెలది:-

మాతృభాషనెపుడు మరుగుపరచవద్దు
అన్యభాషలింకనాదరించు
అమృత తుల్య భాష యాలోచనలకూత
అమ్మ భాష మనకునాది భాష.

ఆటవెలది:-

అమ్మ భాష మనకు నానందములనిచ్చు
వినగ,అనగ, చదువ వీలు కలుగు
సులభ గ్రాహ్యమునకు సుందరమగు భాష
అమ్మ భాషకన్ననన్యమేది?

తేటగీతి:-

మాతృభాషలోన చదువు మర్మమెఱుగు
మాతృభాషలోన పలుకు మన్ననిచ్చు
పద్య,గద్య పఠనములఁ బదిల పఱుచు
పఠిత బాలకులకునింపు కఠినమవదు
అట్టి విద్యల నేర్వగ హాయిగుండు.

కశోర్ఝుల నాగేశ్వర్ శర్మ,
ధర్మపురి.

## ప్రక్రియ: గజల్స్ లాహిరి

అలుపులేని శ్రమజీవియు మురిపించే చంద్రముఖీ
శ్రమదాచని విలువలగని కురిపించే చంద్రముఖీ
ప్రేమలెన్నోపంచుతుంది మురిపెంగా చూసుకుంది
ఇల్లునేమో ఇలగ మార్చి మరిపించే చంద్రముఖీ
పుట్టింట్లోమహాలక్ష్మివి మెట్టింట్లో రారాణివి
ఇంట దెచ్చే గౌరవమ్ము వెలుగుపంచే చంద్రముఖీ
మోము పైనచిరునవ్వులె మనసంతా నిండిపోవు
అలసటంత మరిచిపోయి శ్రమియించే చంద్రముఖీ

సాహితీ కిరీటి సాయి టేకుర్ల
నిజామాబాద్ జిల్లా

## ప్రహ్లాద చరిత్ర

సీ.శ్రీ.శ్రీ
శ్రీహరీ! శరణన్న శీఘ్రముగావచ్చి
ప్రహ్లాదుగాచిన పరమపురుష!
దాస్యవిముక్తికై తపమునొనర్చిన
ధ్రువునిగాచినయట్టి దురితహరుడ!
గజరాజు దీనుడై కమలాక్ష యనివేడ
రక్షించి బ్రోచిన లచ్చిమగడ!
యాపదలోనున్న ద్రౌపది మ్రొక్కగ
మానంబు కాచిన మహిధరుండ!

తే.గీ.శ్రీ.శ్రీ
జగతిఁ నడిపించు సర్వేశ చక్రధారి!
దీనజనుల వెన్నుండెడి దీనబంధు!
కలిత యాదాద్రిరూప లక్ష్మయ్య పోష!
కృపను జూపు నృసింహ మోకిలనివాస!

రఘుపాత్రుని.సాయిశివలి
బ్రాహ్మణతర్లా గ్రామము, శ్రీకాకుళం జిల్లా

## అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం

ప్రక్రియ :- పద్యం ఆటవెలది

శ్రమను నమ్ముకున్న శ్రామికులమనుచు
ముందు నడచి రిలన ముదముతోడ
కష్టజీవులయిరి యిష్టముగనువీరు
భవ్యకీర్తిగాంచ భరతమందు!

ధరణిలోనికెల్లి ధన్యతగాంచిరి
సింగరేణి కిలను సిరులు పంచ
తట్టబుట్టబట్టి తనువంత వంచిరి
పరులసేవకొరకు పాటుబడిరి!

ఎర్రజెండ బూని యేకమయ్యినిలచి
ఐకమత్యముగను యవనిమెదలి
గొంతు గొంతు గలిపి గోసలెన్నోబాసి
యునికిచాటుచుండ్రి నుర్వియందు!

పుల్లూరి నాగేశ్వర్
తాండూర్ గ్రామం మంచిర్యాల జిల్లా

# నీలగిరి సాహితీ సంగమం

## జగతికి వైద్యుడు

### వచనకవిత.

నిశీధిని పారద్రోలుతూ , ఉషస్సులు వెదజల్లుతూ..
తూర్పుదిక్కున సింధూరమై..
సప్తాశ్వరథారూఢుడై...
కాలగమనాన్ని సూచించే దిక్సూచియై ..
పంచభూతములకు ప్రేరణనిస్తున్నాడు సూర్యభగవానుడు...
తన కిరణతేజస్సుతో...
సూర్యనమస్కారములతో మేనికి సొబగులద్దుతూ...
కీళ్ళవాతాన్ని తొలగించే ఆరోగ్య ప్రదాతయై ..
వేనోళ్ళ కీర్తింపబడుతున్నాడు ఆదిత్యుడు జగతికేవైద్యుడై...
దినకరుని ఉషస్సులే
లోకాన్ని ప్రకాశింపజేసే చైతన్యదీపాలై... నడిపిస్తున్నాయి
సృష్టినంతటిని రక్షణకవచాలై....

కొంటికర్ల లలిత
ధర్మపురి

## పల్లెసీమలు ప్రక్రియ: ద్విపద

తల్లి ధరణియందు తనరారు చుండు
పల్లెటూర్లు మనకు పట్టు కొమ్మలుగ
పారుచుండ నదులు పంట పొలముల
సారవంతపు భూమి సస్యము లొసగు
ముంగిళ్ళు మురియును ముత్యాలు పరచి
రంగవల్లులు దిద్ది రమణీయ ముగను
చెలువము లవి జేయ చిత్ర రచనలు
కలువ పూలు విరిసి కనువిందు గూర్చు
జాగరూకత మెండు జనపదములను
నాగరీకత గాంచు నగరములందు
నరక కూపములవి నగర బ్రతుకులు
పరిఢవిల్లు నెపుడు పరివసధములు

మరింగంటి శ్రీనివాస్
హైదరాబాద్

## ఆటవెలది..పద్యాలు

కష్టములను పొంది యిష్టముతోరైతు
దేశ జనుల కెపుడు యాశ తీర్చు
అప్పు లెన్ని యున్న యతడేలె రారాజు
విరలునిపలుకులను వినుపటేల

ఒంటి నిండ యీర్ష్య కంటిలో కోపము
కొంత మంది కుండు వింత బుద్ధి
మంచివారి కింత మర్యాద నియ్యరు
విరలుని పలుకులను వినుపటేల

పెద్ద వాళ్ళ తోటి పేజీలు వలదయ్య
కత్తి మీది సాము కాటు వేయు
తగువులాడ బోవ తలబొప్పి లెక్కును
విరలువినుపటేలని పలుకులను

...జేపీ రావు పాటిల్

## శీర్షిక : విద్య

అనంతమైన జ్ఞానాన్నికి మూలం విద్య
అద్భుతమైన మేధస్సుకి రూపం విద్య
పురాతన గాథలను అందించడానికి
పుణ్య నదుల కథలను వివరించడానికి
ఎన్నో ఆవిష్కరణల జ్ఞానం చదువుతోనే
మరెన్నో అవిరియంత్రాలు సాధ్యం విద్యతోనే
నింగిలోకి దూసుకుపోయే విమనమైన
నీటిలో తేలుతూపోయే పడవైన
ఆసుపత్రిలో దొరికే అక్షిజన్ అయిన
అవసరానికి వినియోగించే వాహనమైన
అనేక ఆలోచనలు జ్ఞానంతోనే సాధ్యం
జ్ఞానం దాదాపు విద్యతోనే లభ్యం
చదువుతోనే సర్వం ముడిపడి ఉంది
చదువుతేనే సమస్తము అర్థం అవుతుంది

వి.అశోక్
మంథన్ గోడ్, నారాయణ పేట

# నేర నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం.

**-పెండింగ్ కేసుల త్వరిత పరిష్కారానికి ఆదేశాలు.**
**-నార్సింగి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన మెదక్ ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్.**




**మెదక్ జిల్లా మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు అత్యంత కీలకమని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ పేర్కొన్నారు. శనివారం నార్సింగి పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసుల వివరాలు, పెండింగ్ కేసుల స్థితి, రికార్డులను సమగ్రంగా పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేసి, నిందితులకు చట్టపరంగా శిక్ష పడేలా నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రౌడీషీటర్లు, కేడీలు, అనుమానితులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిఘాను మరింత కట్టుదిట్టం చేయాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా జీవించేలా సమగ్ర భద్రత కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా అధికారులు గ్రామాలను నిరంతరం సందర్శిస్తూ ప్రజలతో మమేకం కావాలని ఎస్పీ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కల్పించాలని, తెలియని కాల్స్, సందేశాలు, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం, మైనర్ డ్రైవింగ్ వల్ల కలిగే ప్రమాదాలను ప్రజలకు వివరించాలని ఆదేశించారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేసి, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు, స్థానికుల సహకారంతో మరిన్ని సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని, ఎలాంటి సమస్యలున్నా నేరుగా తనను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట్ సీఐ వెంకట రాజా గౌడ్, ఎస్బీ ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, ఎస్ఐ సృజన, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నా చావుకు వారే కారణం.. నోట్ రాసి సూసైడ్..!

**చిట్యాల మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

చిట్యాల మండలం నేరడలో విషాదం నెలకొంది. శనివారం తెల్లవారుజామున చేనేత కార్మికుడు సత్యనారాయణ తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పుల బాధతో పాటు, తనకు డబ్బులు ఇవ్వాల్సిన వారు ఇవ్వకపోవడంతో మనస్తాపంతో బలవన్మరణానికి పాల్పడ్డాడని గ్రామస్థులు చెబుతున్నారు. తన మరణానికి నలుగురు వ్యక్తులు కారణమని పేర్కొంటూ ఆయన సూసైడ్ నోట్ రాసినట్లు సమాచారం.





# పంట మార్పిడి విధానంతో అధిక దిగుబడులు





**ఎలిగేడు, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రైతులు ఆధునిక సాగు పద్ధతులను అవలంబిస్తూ యూరియా, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి పంట మార్పిడి విధానాన్ని పాటిస్తే చీడపీడల సమస్య తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చని కూనారం వ్యవసాయ పరిశోధన కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త సతీష్ చంద్ర తెలిపారు. ఎలిగేడు మండల కేంద్రంలోని జీపీ కార్యాలయం ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో భాగంగా పీజేటీఏయూ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్లో అధిక డిమాండ్ ఉన్న వరి రకాలను సాగు చేయడం ద్వారా రైతులు లాభాలు పొందవచ్చని సూచించారు. తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కరీంనగర్ శాస్త్రవేత్త డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ అవసరానికి మించి రసాయన ఎరువులు వాడితే నేల, నీరు, గాలి కాలుష్యానికి గురవుతాయని హెచ్చరించారు. సరైన సమయంలో సరైన మందును సరైన మోతాదులో పిచికారి చేయాలని సూచించారు. ఏవో ఉమాపతి మాట్లాడుతూ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సిఫారసు చేసిన రకాలను సాగు చేస్తే రైతులకు సకాలంలో బోనస్, మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కప్పల ప్రవీణ్, వ్యవసాయ--ఉద్యాన విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో రథోత్సవం




**ఎలిగేడు, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఎలిగేడు మండలంలోని ముప్పిరితోట గ్రామంలో శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడగు శ్రీ మదలమేల్మంగా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం శేషహోమం, ప్రాభోధకి, బలిహరణం జరగగా సాయంత్రం బలిహరణం, రథప్రతిష్ట అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం రథోత్సవం, జాతరతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కొండపాక రామాచార్యులు, ఆలయ నిర్వాహకులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఎలిగేడు వాసికి మీడియా అవార్డు



**ఎలిగేడు, మే 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** హైదరాబాద్ హైటెక్స్‌లో ప్రముఖ కార్పొరేట్ మీడియా సంస్థ నిర్వహించిన మీడియా అవార్డ్స్ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా ఎలిగేడు గ్రామానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు బుర్ర ఆంజనేయులు గౌడ్ అవార్డు అందుకున్నారు. దశాబ్దాలుగా పత్రికా రంగంలో క్షేత్రస్థాయి నుండి అంచెలంచెలుగా ఎదిగి, ప్రస్తుతం రాష్ట్ర అసెంబ్లీ అడ్వైజరీ కమిటీ సభ్యునిగా సేవలందిస్తున్న ఆయన కృషిని గుర్తించి ఈ అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎలిగేడు గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, పలు మీడియా రిపోర్టర్లు ఆనందం వ్యక్తం చేశారు.

# చింత చిగురుతో ఆరోగ్య ప్రయోజనాలు



ఈ సీజన్‌లో విరివిగా లభ్యమయ్యే చింత చిగురుతో ఎన్నో లాభాలున్నాయి. రుచికరమైన ఆహారంగానే కాక దీన్ని తినడం వల్ల ఆరోగ్యం కూడా చేకూరుతుంది. మలబద్ధకం సమస్య తొలగిపోతుంది. పైల్స్ ఉన్న వారికి కూడా బాగానే పనిచేస్తుంది. ఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండడం వల్ల చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచిది పెంచుతుంది. చింత చిగురును ఉడికించిన నీటిని పుక్కిలిస్తే గొంతు నొప్పి, మంట, వాపు తగ్గుతాయి. యాంటీ ఇన్‌ఫ్లేమేటరీ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. వేడి మసాలా పదార్థాలు తినడం వల్ల నోటిలో వచ్చే పగుళ్లు, పూతలను తగ్గిస్తుంది. శరీరంలో ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి అవసరమైన పోషకాలను అందిస్తుంది. దీనితో చేసిన వంటలను చిన్నారులకు తినిపిస్తే కడుపులో నులి పురుగుల సమస్య తగ్గుతుంది. విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇందువల్ల ఇది శరీర రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. యాంటీ సెప్టిక్, యాంటీ వైరల్ గుణాలు ఉన్నాయి. పలు రకాల క్యాన్సర్లు రాకుండా చూసే ఔషధ గుణాలున్నాయి. ఎముకలు దృఢత్వాన్ని సంతరించుకుంటాయి. థైరాయిడ్ సమస్యలు తగ్గుతాయి. రక్తంలోని చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది. ఆర్థరైటిస్ సమస్యతో బాధ పడుతున్న వారికి ఇది మేలు చేస్తుంది. శరీరంలోని వ్యర్థాలను బయటికి పంపే గుణాలున్నాయి.

# పప్పు దినుసులను తిన్నాక అజీర్తి వస్తుందా..

## అయితే కారణం ఇదే..



శాకాహారులు ప్రోటీన్ల కోసం ఎక్కువగా పప్పు దినుసులపై ఆధారపడతారు. అయితే శాకాహార ప్రోటీన్లు తిన్న తర్వాత కొందరికి జీర్ణ సమస్యలు ఎదురవుతుంటాయి. దీనికి కారణం ప్రోటీన్ కాదు, వాటిని సరిగ్గా సిద్ధం చేయకపోవడమేనని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. బీన్స్, పప్పులు, శనగలు వంటి దినుసులను వండే ముందు కొన్ని గంటలు లేదా రాత్రంతా నానబెట్టడం చాలా ముఖ్యమని వారు సూచిస్తున్నారు. శాకాహార ప్రోటీన్లు సాధారణంగా ఫైబర్ ఎక్కువగా ఉండటం, సంక్లిష్ట నిర్మాణం కలిగి ఉండటం వల్ల జీర్ణం కావడానికి కొంచెం సమయం పడుతుంది. వీటిలో ఉండే ఫైటేట్స్, ఎంజైమ్ ఇన్హిబిటర్స్ అనే పదార్థాలు జీర్ణ ప్రక్రియను మందగింపజేస్తాయి. అందుకే సరైన విధంగా సిద్ధం చేయకపోతే గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు వస్తాయి.

**నానబెట్టడమే పరిష్కారం..**

ఇక ఈ సమస్యకు సులభమైన పరిష్కారం నానబెట్టడమే. పప్పు దినుసులను నీటిలో నానబెట్టినప్పుడు వాటిలోని ఫైటేట్స్ క్రమంగా తగ్గుతాయి. అలాగే ఎంజైమ్స్ యాక్టివేట్ అవుతూ జీర్ణానికి సహాయపడతాయి. దీంతో వండిన తర్వాత అవి తేలికగా జీర్ణమవుతాయి. శరీరానికి అవసరమైన పోషకాలు సులభంగా గ్రహించబడతాయి. జీర్ణ సమస్యలకు అసలు కారణం శాకాహార ప్రోటీన్లు కావు, వాటిని నానబెట్టకపోవడమే అని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. కాబట్టి బీన్స్, పప్పులు, శనగలు వండే ముందు తప్పనిసరిగా కొన్ని గంటలు నానబెట్టడం అలవాటు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

**నువ్వులను కూడా..**

ఇక నువ్వుల గింజలను రోజువారీ ఆహారంలో చేర్చుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఇవి కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, యాంటీ ఆక్సిడెంట్ల వంటి కీలక పోషకాలతో సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఎముకల బలాన్ని పెంచడమే కాకుండా, మెదడు ఆరోగ్యం, గుండె ఆరోగ్యం మెరుగుపడటానికి కూడా సహాయపడతాయి. సరైన విధంగా ఆహారాన్ని సిద్ధం చేసుకోవడం ద్వారా జీర్ణ సమస్యలను నివారించవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు.

# పొటాటో రోజూ తింటే ఆరోగ్యకరమైనా?!



ఇంటర్నెట్‌డెస్క్

పొటాటో అంటే ఎవరికిష్టం ఉండదు చెప్పండి. మరీ ముఖ్యంగా చిన్నపిల్లలకి పొటాటోతో చేసిన ఏ వంటకమైనా ఎంతో ఇష్టంగా తింటారు. ఇక పెద్దవాళ్లు కూడా పొటాటో సలాడ్, ఫ్రెంచ్ ఫ్రైస్ ఇలాంటి రకరకాల వంటకాలతో దీన్ని రోజూ తింటూనే ఉంటారు. ఇలా బంగాళదుంపని రోజూ తింటే ఆరోగ్యానికి మంచిదా? కాదా? లేదా ఏవైనా అనారోగ్య సమస్యలు వస్తాయా? అని తెలుసుకోవాలనుందా? దీనికి వైద్యులు ఏం సూచిస్తున్నారంటే...?!

-- పొటాటోలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. అలాగే ఐరన్, విటమిన్ సి, విటమిన్ బి6లు కూడా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికెంతో మేలు చేస్తాయి.

-- బంగాళదుంపల్ని నూనెలో డీప్ ఫ్రై చేసుకుని తినడం కన్నా.. వాటిని ఉడకబెట్టుకుని తింటే ఆరోగ్యానికి మంచిదని న్యూట్రీషియన్లు చెబుతున్నారు. నూనెలో వేయించిన పొటాటోని తీసుకుంటే శరీరంలో అనారోగ్యకరమైన కొవ్వు పేరుకుపోయే ప్రమాదం ఉంది. దీంతో అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వైద్యులు సూచిస్తున్నారు.

-- మీకు నీరసంగా ఉన్నప్పుడు ఉడకబెట్టిన బంగాళదుంపల్ని తీసుకుంటే తక్షణమే శక్తి వస్తుంది. ముఖ్యంగా పొటాటో మెదడు, ఎముకల ఆరోగ్యానికి ఎంతోమంచిది.

-- ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్న బంగాళదుంపల్ని మధుమేహ వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహా మేరకే వాటిని తీసుకోవాలి.

# వామ్మో.. మామిడిపండ్లు అందరికీ మంచిది కాదు..?

## ఈ సమస్యలు ఉన్నవారు తింటే ముప్పే!

వేసవి కాలం అంటేనే మామిడి పండ్ల సీజన్. తీయని రుచితో పాటు విటమిన్ ఏ, సి, ఫైబర్ వంటి పోషకాలు పుష్కలంగా ఉండే మామిడిని అందరూ ఇష్టంగా తింటారు. అయితే, ఈ తీపి పండు అందరికీ ఆరోగ్యకరం కాదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా మధుమేహం (ఊఋఎవ్వం) ఉన్నవారు మామిడి పండ్లను తినేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే ఇవి రక్తంలోని చక్కెర స్థాయిలను వేగంగా పెంచుతాయి.

**మధుమేహ వ్యాధిగ్రస్తులు :** మామిడి పండులో సహజంగానే చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉంటాయి. వీటిని తిన్నప్పుడు రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలు వేగంగా పెరుగుతాయి. కాబట్టి డయాబెటిస్ ఉన్నవారు వైద్యుని సలహా మేరకు మాత్రమే పరిమిత పరిమాణంలో తీసుకోవాలి. మామిడి పండ్లను తినే ముందు కనీసం గంట సేపు నీటిలో నానబెట్టడం వల్ల వాటి వేడి చేసే గుణం తగ్గుతుంది.

**బరువు పెరగడం :** మామిడిలో కేలరీలు ఎక్కువగా ఉంటాయి. బరువు తగ్గాలని ప్రయత్నించే వారు లేదా ఇప్పటికే అధిక బరువు ఉన్నవారు మామిడి పండ్లను ఎక్కువగా తింటే బరువు మరింత పెరిగే అవకాశం ఉంది. కాబట్టి బరువు తగ్గాలనుకునే వారు మామిడి పండ్ల వినియోగాన్ని పరిమితం చేయాలి.

**జీర్ణ సంబంధిత సమస్యలు:** గ్యాస్, ఎసిడిటీ లేదా అజీర్తితో బాధపడేవారు మామిడి పండ్లను తినేటప్పుడు జాగ్రత్త వహించాలి. ముఖ్యంగా ఖాళీ కడుపుతో వీటిని తీసుకోవడం వల్ల కొందరిలో పొట్టలో అసౌకర్యం కలగవచ్చు. జీర్ణక్రియ సమస్యలతో బాధపడేవారు, అలర్జీలు ఉన్నవారు మామిడి పండ్లను ఎంత తక్కువగా తింటే అంత మంచిది.

**అలర్జీలు:** కొందరికి మామిడి పండ్ల వల్ల అలర్జీ రావచ్చు. దీనిని తిన్న తర్వాత నోటి చుట్టూ దురద, గొంతులో మంట లేదా చర్మంపై దద్దుర్లు కనిపిస్తే వెంటనే మామిడి పండ్లను తినడం ఆపేయాలి. అతి సర్వత్ర వర్జయేత్ అన్నట్లుగా, ఏదైనా పరిమితికి మించి తీసుకుంటే అది ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది. మామిడి పండ్ల విషయంలో కూడా ఇదే వర్తిస్తుంది.

**మామిడి పండ్లను ఎలా తినాలి?:** మామిడి పండ్లను తినడానికి సరైన పద్ధతి ఒకటి ఉంది. వీటిని తినడానికి ముందు కనీసం 1 నుండి 2 గంటల పాటు నీటిలో నానబెట్టాలి. ఇలా చేయడం వల్ల మామిడిలోని ఉష్ణ తత్వం (వేడి చేసే గుణం) తగ్గుతుంది. ఇది శరీరానికి మేలు చేస్తుంది. రుచి బాగుందని అతిగా తినకుండా, మీ ఆరోగ్య స్థితిని బట్టి తగిన మోతాదులో తీసుకుంటే సీజన్ పండు ఆనందాన్ని పొందవచ్చు. ఏదైనా సందేహం ఉంటే మీ డాక్టర్ ను సంప్రదించడం మంచిది.

